ప్రజాశక్తి

Vol. 4, no. 23

(Jun. 7, 1944)

బెజవాడ, 1944

Record no. 683

Prajāśakti

Vol. 4, no. 23

(Jun. 7, 1944)

Bejavāḍa, 1944

Record no. 683

Regd. No. M. 4486 0.2.0

ప్రజాశక్తి

భారత కమ్యూనిస్టుపార్టీ, ఆంధ్రకమిటీ పత్రిక

సంపుటి 4 సంచిక 23 | : సంపాదకవర్గం : మద్దుకూరి చంద్రశేఖరరావు (సం) కంభంపాటి సత్యనారాయణ పుచ్చలపల్లి సుందరయ్య తుమ్మల వెంకటరామయ్య చలసాని వాసుదేవరావు | బుధవారం 7-6-44

11 వ నైజాంరాష్ట్ర ఆంధ్ర మహాసభ

—///—

త్యాగమూర్తుల కృషిఫలితంగా ప్రజల్లో కొత్తచైతన్యం

[మా విలేఖరి]

ఎనభై లక్షల నైజాం ఆంధ్రుల అభ్యున్నతికై 25 సంవత్సరాలుగా పాటుబడుతూ, బ్రహ్మాండమైన ప్రజా సంస్థగా వృద్ధిచెందిన ఆంధ్రమహాసభ 11వ సమావేశం భువనగిరిలో జరుగుతుందని విని, 24-5-44వ తేదీ సాయంకాలం రైల్లో ప్రయాణమయాను.

రైలు వరంగల్ జిల్లాలో ప్రవేశించింది. కొత్తగూడెం బొగ్గుగనులలో పనిచేసే ముగ్గురుకార్మికులు మాపెట్టెలో యెక్కారు వారితో సంభాషణకు దిగాను. ఇతర ప్రాంతాల కార్మికులకూ, వీరికీ, ఎంతోతేడా కనిపించింది. కార్మిక సంఘం అంటేయేమో వీరికి తెలియదు. వీరి తరపున ఆంధ్రమహాసభ ఇండియా ప్రభుత్వానికి మెమొరాండం పంపి, ప్రజల్లో ఆందోళన చేసిన ఫలితంగా రోజుకూలి ఎనిమిదణాలనుంచి ఒకరూపాయవరకు హెచ్చిందనే విషయం వీరికి అర్థమయేలా చెప్పడానికి ఒకఅరగంట పట్టింది. గనుల చట్టంప్రకారం వీరికిగల ముఖ్యమైన హక్కులేవో వివరించుతూంటే, ఆశ్చర్యంగా నోళ్లతెరుచుకొని వింటున్నారు.

దాదాపు 8000 మంది కార్మికులు ఒకేచోట కలిసి పనిచేసే ప్రధాన కీలకపరిశ్రమలోనే పరిస్థితులిలా వుంటే, రైతులేస్థితిలో ఉంటారో ఊహించుకొనగలిగాను.

మహాసభ కార్యకర్తలు

25 వ తేదీ ఉదయానికి భువనగిరి చేరుకున్నాను. మహాసభ కార్యకర్తల నొక్కొక్కరినే కలుసుకున్నాను. అందరూ దేశసేవలో ఆరితేరినవారే. అధ్యక్షపీఠానికి ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన రావి నారాయణరెడ్డిగారు 1930 లో మహాత్ముని పిలుపువిని, కాలేజీవిద్యను విడిచిపెట్టి జాతీయోద్యమంలో ప్రవేశించారు. 1938 లో జరిగిన స్టేట్ కాంగ్రెసు సత్యాగ్రహంలో 4 నెలల కారాగార శిక్ష అనుభవించారు. సుమారు 600 యకరాల భూమి గలిగి, వతందార్ల (గ్రామ మునసబుల) కుటుంబానికి చెందినప్పటికీ, రైతుల హక్కులకై నిర్భయంగా పోరుసల్పుతున్నారు. ప్రస్తుతం కమ్యూనిస్టుగా తమ పూర్తికాలాన్ని ప్రజాసేవలో వినియోగిస్తున్నారు.

బద్దం ఎల్లారెడ్డిగారు ప్రధాన కార్యదర్శి. ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొని జైలుశిక్ష అనుభవించారు. స్టేట్ కాంగ్రెసు సత్యాగ్రహంలో 3 సంవత్సరాల కఠినశిక్ష విధించబడి, 4 నెలల తరవాత యితర సత్యాగ్రహులతోబాటు విడుదల అయి వచ్చారు. 1941 లో కరీంనగర్ జిల్లా భయంకరమైన కరువుకు గురి అయినప్పుడు దాదాపు 10 వేల మంది ప్రజల్ని సమీకరించి, జిల్లాఅధికారివద్దకు "ఆకలియాత్రలు" నడిపారు. నైజాం ప్రభుత్వం వద్దకు డెప్యుటేషన్ తీసుకెళ్లారు. ఈ ఆందోళన ఫలితంగా ఆయేడు జిల్లా అంతటా రైతులకు శిస్తురెమిషన్ లభించింది. ఆంధ్రమహాసభ స్థాయిసంఘంలో వీరు మొదటినుంచీ సభ్యులుగా ఉన్నారు.

మహాసభ ఆహ్వానసంఘాధ్యక్షులు ఆరుట్ల లక్ష్మీనరసింహారెడ్డిగారు భువనగిరిలో వకీలు. స్టేట్‌కాంగ్రెసు సత్యాగ్రహంలో పాల్గొన్నవారు. అహ్వానసంఘ సంయుక్త కార్యదర్శి డి వెంకటేశ్వరరావుగారు 1938 లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో-బి. ఏ. చదువుతూ, "వందేమాతరం" సత్యాగ్రహ లో చేరినందుకు సుమారు 1000 మంది విద్యార్థులతో బాటు బయటికి వెళ్ళగొట్టబడ్డారు. రెండవ కార్యదర్శి ఆరుట్ల రామచంద్రారెడ్డిగారుకూడా "వందేమాతరం" ఉద్యమంలోనూ, స్టేట్ కాంగ్రెసు సత్యాగ్రహంలోను పాల్గొన్నారు.

ఇక, వాలంటీర్ దళాధిపతి వి. వి. రమణగారు, పోలీసు సబ్ ఇన్‌స్పెక్టరుగా ఉంటూ, స్టేట్‌కాంగ్రెసు సత్యాగ్రహం వల్ల ఆకర్షింపబడి, తన పదవికి రాజీనామా యిచ్చారు. అప్పటినుంచి నేటివరకూ రాజకీయాల్లో పనిచేస్తున్నారు. వంటశాల అధిపతి ఎస్. రామనాథంగారు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎల్. ఎల్. బి. క్లాసు చదువుతూ, "వందేమాతరం" సత్యాగ్రహంలోను, స్టేట్ కాంగ్రెసు సత్యాగ్రహంలోను, పాల్గొన్నారు. అజంజాహి బట్టలమిల్లు కార్మికుల సమ్మె సందర్భంలో వీరిపై ప్రభుత్వం 6 నెలల వరకు వరంగల్ జిల్లాలో ప్రవేశించరాదని ఉత్తరువు జారీ చేసింది.

పైవారందరూ ఆంధ్రమహాసభ కార్యక్రమాన్ని ఆచరణలో పెడుతూ, ప్రజాసేవలో తమ పూర్తికాలాన్ని వినియోగిస్తున్నారు.

ఇట్టి త్యాగమూర్తుల కృషిఫలితంగా, ఆంధ్ర మహాసభ సభ్యత్వం ఒక్కసారి 13000 నుండి 23000 కు పెరిగింది. ప్రాథమికకమిటీలు 70 నుండి 250 వరకూఎక్కువయాయి. 9 జిల్లాలలో 8 జిల్లాలకు సభ్యత్వం వ్యాపించింది. మధ్యయుగాలనాటి ఫ్యూడల్ విధానం క్రింద నలిగి కృశించే రైతాంగంలో అపూర్వమైన చైతన్యం కలిగింది. ఈ కాన్ఫరెన్సును విజయవంతంగా నిర్వహించుటకు సుమారు 10 వేల రూపాయలు ప్రజలనుండి విరాళాలుగా వచ్చాయి.

వాలంటీర్లు, ప్రతినిధులు, ప్రేక్షకులు

మహాసభకు 10 రోజులు ముందుగానే వాలంటీర్లువచ్చి, పందిళ్ళ నిర్మాణం, వంటశాల యేర్పాట్లు ప్రారంభించారు. పదిమంది హరిజనులు, 3 గ్గురు క్రిస్టియన్లు, మరోపదిమంది ముస్లిం యువకులు, వారంరోజులు ముందుగానే వాలంటీర్లుగా వచ్చి, రాటలు పాతడం-పందిళ్ళువేయడం వగైరా పనులలో రాత్రింబగళ్ళు నిమగ్నులై పనిచేశారు. ముస్లింలు సైకిళ్ల బాగుచేయడం, గడియారాల రిపేరింగు, కుట్టుపని వగైరా వృత్తులకు చెందిన మధ్యతరగతివారు. వీరుగాక, ఉస్మానియా విశ్వవిద్యాలయంనుంచి వచ్చిన విద్యార్థులు బొమ్మలు గీయడంలోను, గేటును అలంకరించడంలోను, సహాయం చేశారు.

ప్రజాసేవలో మతకక్షలకు స్థానం ఉండదనుట కిదొక చక్కని నిదర్శనం.

సూర్యాపేట తాలూకాలో 55 మంది వాలంటీర్లు ప్రచారకదళాలుగా ఏర్పడి, వివిధ గ్రామాలలో ప్రచారం చేసుకుంటూ 60 మైళ్ళు నడిచివచ్చారు. నల్లగొండతాలూకాలో 30 మంది వాలంటీర్లు 60 మైళ్ళు సంచారంచేసి వచ్చారు. మరికొన్ని ప్రచారకదళాలు భువనగిరి, జనగాం, శరికి తాలూకాలలో 170 గ్రామాలలో ప్రచారంచేసి, మహాసభకు హాజరయారు. మధిర తాలూకా వాలంటీరుదళం మూడువేల ప్రజలలో ప్రచారంచేసి 27 మైళ్ళు నడిచివచ్చారు.

వీరు ప్రచారంచేసిన అన్నిగ్రామాల్లోను పటేలు, పట్వారీలు (మునసబు, కరణాలు) చట్టవిరుద్ధంగా వెట్టిచేయించుకోవడం, లంచాలు వసూలుచేయడం, జాగీరుదార్లు రైతులపైజరిపే నిరంకుశచర్యలు, అక్రమవసూళ్ళు, మొదలైన పద్ధతులను ఖండిస్తూ ఆంధ్రమహాసభ కార్యక్రమాన్ని ప్రచారంచేశారు.

మహాసభకు మొత్తం 500 మంది ప్రతినిధులు వచ్చారు. వీరిలో అత్యధికభాగం రోజల్లా కష్టపడి పనిచేసే పేద రైతులు, కూలీలు. గత రెండుసంవత్సరాలలో ఆంధ్రమహాసభ ప్రచారకులు వివిధప్రాంతాలలో ప్రజల సమస్యలు తీసుకొని, వాటి పరిష్కారంకొరకు అనేకపోరాటాలు నడపడంవల్ల కలిగిన చైతన్యఫలితం ఇది.

వివిధజిల్లాలలో ప్రజావిజయాలు

ఉదాహరణకు, భువనగిరి తాలూకాలో సుంకిశాల అనే జాగీరుగ్రామంలో జాగీరుదారు చట్టవిరుద్ధంగా ఏటేటవెయ్యి రూపాయలు మొదలు 1400 రూపాయలవరకు విలువగల ధాన్యాన్ని వసూలుచేసే ఆచారం మాపు చేయబడింది. కూలీలు వంతులప్రకారం చేయవలసిన వెట్టిచాకిరి రద్దుచేయబడింది. నల్లగొండతాలూకాలో పది, పదిహేను గ్రామాలలో వివిధరూపాల వెట్టిచాకిరి రద్దుఅయినది. పానగల్లు అనే గ్రామంలో ధాన్యగ్రహణశాసనం క్రింద రైతులకు న్యాయముగా కలుగజేయబడ్డ మినహాయింపులను ఆంధ్రమహాసభ ప్రచారకులు అమలుజరిపించారు. తత్ఫలితంగా ఆగ్రామానికి 3500 రూపాయల విలువగల ధాన్యం మిగిలింది. సూర్యాపేట టౌనులో వర్తకులు రైతులవద్ద కొనేధాన్యానికి నూరురూపాయల విలువగల సరకుకు 15 అణాలవంతున వసూలుచేసి, హమాలి కూలీలకు నాలుగులేక అయిదు అణాలు మాత్రమే యిచ్చి, చట్టధిక్కారం చేయడం చాలా కాలంనుంచి అమలులోవుంది. ఇప్పుడు ఈపద్ధతి రద్దుచేయబడింది. సూర్యాపేట తాలూకాగ్రామాలలో ధాన్యగ్రహణశాసనంకింద గోడౌను మేనేజర్లు ధాన్యంకొలతలో చట్టవిరుద్ధంగా వసూలుచేసే "తరుగు"లు అపుచేయబడ్డాయి. కొత్తగూడెం కాసర్లపాడు, గ్రామాలలో పటేలు, పట్వారీలు రైతులవద్ద రూపాయకు పావలాచొప్పున అదనంగా వసూలు చేయబడే అక్రమపన్ను మాపుచేయబడింది.

ఇలాగే యితరజిల్లాలలో కూడా మహాసభ వర్కర్లు చేసిన ప్రచారపోరాటాల ఫలితంగా, ప్రజలలో బ్రహ్మాండమైన సంచలనం కలిగింది. తత్ఫలితంగా అయిదారువేల మంది ప్రేక్షకులు మహాసభకు ఉత్సాహంతో ప్రయాణమై వచ్చారు.

మొదటిరోజున ప్రతినిధులబసకు వెళ్లాను. మెదకుజిల్లా నుంచివచ్చిన 30 మంది ప్రతినిధులు రెండురోజులకు సరిపోయే రొట్టెలు, పూరీలు, ఊరగాయ మూటలు కట్టుకొని కూచున్నారు. నాకు ఆశ్చర్యంకలిగింది. ఆహ్వాన సంఘంవారికి కొంతఖర్చు, శ్రమ తగ్గించేటందుకు వారు చేసుకున్న ఏర్పాటుయిది.

ఇలాగే ప్రేక్షకులుగా వచ్చిన అనేకమంది పేదరైతులు స్వయంగా వంటలుచేసుకొని అన్నంతినడం చూచాను. ఆంధ్రమహాసభ ప్రజాసంస్థగా వృద్ధిచెందినదనడానికి ఇంతకంటే ఏమినిదర్శనంకావాలి ?

విషయనిర్ణయసభలు

నేను వచ్చినరోజునే విషయనిర్ణయసభ జరిగింది. ఇందులో వివిధరాజకీయ దృక్పథాల(మిగతా 12వ పేజీలో)

బుధవారం ప్రజాశక్తి 7-6-44

రేషనింగ్

ఎట్టకేలకు మద్రాసు ప్రభుత్వం రేషనింగ్ అమలులో పెడుతోంది. కొన్ని పట్టణాలలో ప్రవేశపెట్టింది. తక్కినవాటిలో యీనెల ప్రవేశపెడుతోంది. రేషనింగ్ అవసరాన్ని ఇప్పటికైనా ప్రభుత్వం గుర్తించినందుకు సంతోషం.

ధరలు విపరీతంగా పెరుగుతున్నప్పుడు కంట్రోలుచేయడం తప్పనిసరి అవుతుంది. ఎంతో ఆలస్యమయ్యాక ప్రభుత్వం కంట్రోలుపెట్టింది. దీనిని భగ్నం చేయడానికి సరుకును వ్యాపారస్తులు దాచివేశారు. దొంగమార్కెటులో రహస్యంగా విపరీతఖరీదులకు అమ్మజూపుతున్నారు. దీనికి కారణం ప్రభుత్వం ధరలకంట్రోలుతోపాటు సరుకును తానే కొనివుంచి ప్రజల ఉపయోగంకోసం సప్లయిచేయకపోవడమే; ఈ కారణం ఎరుగని ప్రజలను మోసపుచ్చడానికి వ్యాపారస్తులు కంట్రోలువల్లనే మార్కెటులో వస్తువులు దొరకడంలేదని ప్రచారంచేశారు. కొందరు అమాయకులు యీ విషప్రచారాన్నినమ్మి కంట్రోలు లేకుంటేనే బాగుంటుందనే స్థితికి వచ్చారు. ఇలా దొంగవ్యాపారస్తుల మోసంలో పడటమంటే ధరలు విపరీతంగా పెరగనివ్వడ మన్నమాట. బీదప్రజలకు జీవితావసరవస్తువులు కూడ దొరకక పోవడమన్నమాట.

కంట్రోలు న్యాయంగా అమలుజరగడానికి ఒకేమార్గముంది. ప్రభుత్వమే సరుకును నిలువజేయాలి. లైసెన్సు ఏర్తకులద్వారా ప్రజలందరకు కంట్రోలు ధరలకు అవుసరవస్తువులను అందజేయాలి. ఈ సరుకు ప్రజలకు సక్రమంగా పంచడానికే రేషనింగ్ అవసరం. ఉదాహరణకు చూడండి: సరుకు నిలువచేయకుండా తెనాలి, బెజవాడ, ఏలూరు, బందరు వగైరా పట్టణాలలో యిదివరకు ప్రభుత్వం కట్టెలధర కంట్రోలుచేసి రేషనింగ్ పెట్టింది. వెంటనే వ్యాపారస్తులు సరుకును దాచివేశారు. ప్రజలు కట్టెలు దొరకడంలేదని గగ్గోలుపెట్టారు. సరకు లేకపోవుటచే ప్రభుత్వం సప్లయి చేయలేక చివరకు తెనాలి, ఏలూరు, బెజవాడలలో కట్టెలరేషనింగు రద్దుచేసికోవాలసి వచ్చింది. బెజవాడలో కంట్రోలుధర మణుగు 10 అణాలనుంచి 15 అణాలకు పెంచింది. తెనాలిలో కంట్రోలుధరనే రద్దుచేసికొంది. వ్యాపారస్తులు మరల విపరీతధరలకు కట్టెలను అమ్ముతున్నారు.

ఇదివరకు జరిగినపొరపాట్లు, అనుభవాలనుంచిఅయినా అధికారులు రానున్న చిక్కులను ఎదుర్కొని జాగ్రత్తవహించాలి. రేషనింగ్ పెట్టనున్న పట్టణాలలో బియ్యంవగైరా సరుకులను నిల్వచేయాలి. లైసెన్సుదుకాణాలకుసప్లయిచేసి కంట్రోలు ధరలకు అమ్మించాలి. దొంగవ్యాపారాన్ని కఠినంగా అణచివెయాలి. అపుడే రేషనింగ్ జయప్రదంగా అమలుజరుగుతుంది.

పట్టణాలలో రేషనింగ్ అమలుజరుపునపుడు పట్టణాలమీదే ఆధారపడివున్న పరిసరగ్రామాల అవసరాలను గుర్తించాలి. ఆ పల్లెల ప్రజలకు కూడ రేషనింగు ప్రకారం బియ్యం అందచెయ్యాలి.

ఇప్పటి నిర్ణయంప్రకారం మనిషి 1 కి రోజుకు అర్ధశేరు బియ్యం రేషనుగా యివ్వబడుతుంది. ఈ రేషను అన్నంతోపాటు యితర ఆదరువులు అనగా పప్పు, కూరలు, పాలు, పెరుగులు వుపయోగించగల భాగ్యవంతులకు, మధ్యతరగతి వారికి కటాకటిగా సరిపోతుంది. కాని కాయకష్టంచేసే బీదజనసామాన్యానికి ఏవిధంగాను చాలదు. ఏమంటే కాయకష్టం చేసేవారికి ఎక్కువబియ్యం కావాలి. అంతేగాక బీదలకు అన్నమే ప్రధానమైన ఆహారం. వారికి యితర ఆదరవులు తెచ్చుకొనే శక్తి లేదు. అన్నం, వుప్పు, కారంతోనే వారు సరిపెట్టుకొంటారు. అందుచే కాయకష్టం చేసే బీదలరేషను హెచ్చుచేయాలి. అఖిలభారత ట్రేడ్‌యూనియన్‌కాంగ్రెస్ తీర్మానించినటుల కనీసం ముప్పావుశేరు అయినా యివ్వాలి. గుంటూరుజిల్లా కలెక్టరుగారు అలాంటివారిలెక్కలు తయారుచేసినపక్షిన రేషను హెచ్చుచేస్తామని వాగ్దానంచేశారు. ప్రజాసేవకులు కాయకష్టం చేసేవారి లెక్కలు తయారుచేసి వారిచే హెచ్చురేషనుకు అప్లికేషనులు పెట్టించాలి. అధికారులు ప్రజల ఆహారకమిటీల సహకారం తీసుకోవాలి. రేషనింగ్ అమలుజరపడంలో వచ్చే యిలాంటి చిక్కులను ప్రజల సహకారంతో తొలగించాలి.

ఈ సందర్భంలో మా విన్నపం ఏమంటే రేషనింగు, కంట్రోలు ప్రజాశ్రేయస్సు దృష్టితోనే పెట్టబడుతున్నాయని గమనించాలి. అమలుపరపడంలో వచ్చే లోట్లను అధికారులకు తెలిపితొలగించడానికి కృషిచేయాలి. తమయిండ్లలో ఎక్కువమంది వున్నారని లెక్కలుతీసేవారికి తప్పుడులెక్కలు ఇవ్వకూడదు. ఉదాహరణకు యీ మధ్య రేషనింగ్‌కొరకు తయారుచేసిన లెక్కలలో పట్టణాల జనసంఖ్య చాల పెరిగిందని తెలుస్తోంది. ఏలూరు జనసంఖ్య 70 వేలయితే 1 లక్ష 20 వేలు తేలిందట. ఇలా తప్పుడులెక్కలు యివ్వడం రేషనింగు స్కీమునే దెబ్బగొట్టడమని ప్రజలు గ్రహించాలి. అనగా ప్రజలందరికి న్యాయంగా అన్నం అందజేయడానికి ఆటంకాలు పెట్టడమని తెలిసికోవాలి.

ప్రజలు, అధికారులు ఒండొరుల సహకారంతో పనిచేసి కంట్రోలు-రేషనింగ్ స్కీమును జయప్రదంగా అమలుజరుపుతారని ఆశించుతున్నాము. ఇదేవిధంగా అవసరమైన వస్తువుల నన్నిటికి, ముఖ్యంగా వ్యవసాయదారులకు అవసరమైన ఎరువులు, ఇనుపసామానువగైరా కంట్రోలుధరలకు రేషనింగుపెట్టి పంచాలని మద్రాసు ప్రభుత్వాన్ని కోరుతున్నాము.

రేషనింగును వ్యతిరేకించడమంటే బెంగాలులోవలే కరువు మహామారిని ఆహ్వానించడమన్నమాట. కాబట్టి ప్రజాహితంకోరే దేశభక్తులు అందరూ కంట్రోలు-రేషనింగు స్కీమును బలపరచాలి.

బాల బాలికలకు

●

బెంగాల్ కరువునిధికి బాలసంఘాలు బాగా కృషిచేస్తున్నాయి. పెద్దవాళ్లుకూడా మీకు బాగా తోడ్పడుతున్నందుకు సంతోషం. ఉప్పాడ (తూర్పుగోదావరిజిల్లా) బాలసంఘంవాళ్లు, పెద్దవాళ్ళతో కలసి రు. 5—8—0 వసూలు చేశారు. 13 సోలల బియ్యం, 3 బట్టలు వసూలుచేశారు. స్వయంగా రు. 0-11-6 వసూలు చేశారు. ఇంతేగాదు. వీళ్ళు మహిళాసభలలో పాటలుపాడి కొత్తపల్లిలో ఒక డాక్టరుగారి వద్దనుండి మెడల్ సంపాదించారు. రు. 5—0—9 చందాలవల్ల సంపాదించి, ఒక లైబ్రరీ ప్రారంభించారు. "బాలశక్తి" అనే వ్రాత పత్రికకూడా ప్రారంభించారు. మరి మీరేంచేస్తున్నారు?

బందరు తాలూకా కప్పలదొడ్డి బాలసంఘం కూడా బెంగాల్ నిధికి 7—11—3 వసూలుచేసింది. ఇంతకన్నా మరొక వింత సంగతి చెబుతావినండి:

బాపట్ల తాలూకాలో తెలగాయపాలెం అనే గ్రామం వుంది. ఆగ్రామ బాలసంఘం శ్రీరామనవమికి అన్నదానంలో దుబారాలేకుండా పొదుపుగా వడ్డించి పెద్దల మన్ననలను పొందింది. ఆ బాలసంఘ సభ్యుడు తల్లినడిగి బెంగాల్‌కు ఒక చీర తెచ్చి యిచ్చాడు. బాలసంఘానికి అండగా ఉండే ఒక మాష్టరుగారిని ఒకరిలా ప్రశ్నించారు : "బెంగాల్‌కోసం మీరు ఇంత కష్టపడాలంటారుగదా. మీకు పనిచేయడం అంటే నామర్దాయేం. మీరు కారం దంచగలరా? రు. 2—0—0 ఇస్తాను." అని అన్నాడు. "మాకు పనిచేయడం అంటే ఎప్పుడూ తప్పులేదు. అలాఅని మీరు చేసుకోవలసిన పనులన్నీ మేం చేసిపెట్టము. కాని మీరు సవాలుచేశారు కనుక చేస్తున్నాను" అని మాష్టరుగారు కారం దంచారు. అది పూర్తికాకముందే, అలా సవాలుచేసినాయన రు 2—0—0 ఇచ్చి పంపారు. ఇది చూసి, ఒకామె బెంగాల్ నిధికి రు 10-0-0 ఇచ్చింది. అది మహిళా ఆత్మరక్షణసమితికి పంపబడింది. ఇప్పటికి ఈ గ్రామంలో బాలసంఘం బెంగాల్ నిధికి రు 40 లు పంపింది. ఇంకా 20 రూపాయల ధాన్యం పోగయి వుంది.

చిత్తూరుజిల్లాలో ఏకాంబ్రకుప్పం అనే గ్రామంఉంది. ఇది అరవజిల్లాలకు సమీపంలో ఉండుటచేత ఇక్కడ అరవమే విశేషంగా మాట్లాడుతారు. తమిళ (అరవ) నెల "చిత్రి"లో గంగజాతర పండుగ జరుగుతుంది. ఆపండుగకు ఇక్కడ దసరాపండుగ మాదిరిగానే వేషాలు వేసుకొని డబ్బులు వసూలు చేసికొని పెద్దవాళ్లు తాగి తందనా లాడుతారు. చిన్నవాళ్ళు అవీఇవీ కొనుక్కుంటారు. ఈ సంవత్సరం బాలసంఘం "బెంగాలు కరువునిధికి సహాయం చెయ్యండి" అంటూ అరవంలో పాటలు పాడుతూ, కరువు ఫోటోలతోబయలుదేరింది. వేషాలు వేసుకొన్న ఇతర బాలురుకూడా వీరితో వచ్చి చేరారు. బెంగాల్ నిధికి రు 6—6—7 వసూలుచేసింది.

పల్నాడు తాలూకా పొందుగల బాలసంఘంకూడా తమ చుట్టుప్రక్కల గ్రామాలలో కరువు పాటలుపాడి రు. 5—0—0 బెంగాల్ నిధికి వసూలు చేసింది. ఆ బాలసంఘానికి వాళ్ళ ఉపాధ్యాయుడు దగ్గరవుండి ఎంతో సహాయంచేశాడు.

మీ బాలసంఘాలు బాగా పనిచేస్తే, ఒక్క ఉపాధ్యాయులేగాదు, అందరూ తోడ్పడుతారు.

— దొడ్డమ్మ

వీరేశలింగం వర్ధంతి

ఆంధ్రదేశమంతటా మహోత్సవాలు

"జోహారు జోహారు - వీరేశలింగం
జోహారులివెసీకు - వీరేశలింగం"

అని గతమాసం 27 వ తేదీని యావదాంధ్రదేశం మారుమ్రోగింది. ఆనాదే కందుకూరి వీరేశలింగంగారి 25 వ వర్ధంతిరోజు.

"వీరేశలింగం సంస్కరణలనుకొనసాగించాలి" అనే ప్రతిజ్ఞను వేలకొలది కంఠాలు మిన్నుముట్టించాయి. వేలకొలది స్త్రీ పురుషులు-వృద్ధులు-యువకులు ఆ మహనీయుని దివ్యచరిత్రను విని-" ఇంతటివానిగన్న ఆంధ్రజాతిగదా మనద" ని ఉబ్బిపోయారానాడు.

ప్రజల జీవితమే తన జీవితం

రాజమండ్రి ఆనాడు వర్ధంతికార్యక్రమంతో కలకల్లాడింది. తెల్లవారుజామున 5½ గంటలకు లక్ష్మీవారపుపేట యువకులు ప్రార్థనలు గావించారు. 7½ గంటలకు పంతులుగారినమకాలికులు, అనుచరులు, పండితులు, గాయకులు, 'వీరేశలింగంతోట'కు చేరుకున్నారు పంతులుగారి సమాధికెదురుగా తెలికిచర్ల ప్రకాశంగారు ఈశ్వరోపాసన జరిపారు. తరువాత పంతులుగారి శిష్యుడు, అనుచరుడు అయిన శ్రీ రాయసం వెంకటశివుడుగారి ఆధ్యక్షతను సారస్వతగోష్ఠి జరిగింది. "దేశంఅంటే అభిమానంతో, ప్రజలజీవితమే తమ జీవితముగ ఎంచి, దానిని అభివృద్ధి చేయడానికి పాటుపడ్డారు గనకనే పంతులుగారు అమరజీవు లయ్యార"ని శ్రీ విస్సా అప్పారావుగారన్నారు. ఈ కృషికి భాషనొక సాధనంగా ఉపయోగించి, దానిని కూడా ప్రజాభాషగ అభివృద్ధి చేశారన్నారు. భవిష్యత్తులో కలుగగల మార్పులను దృష్టిలోపెట్టుకొని రాసినగ్రంథాలు కావడంవల్లనే పంతులుగారి గ్రంథాలు భవిష్యత్తుకు కూడా పనికివస్తాయని అన్నారు.

శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారిలా అన్నారు: "పంతులుగారు యదార్థవాది, కనుక, వాస్తవికతను ప్రహసనాల్లో కనబరిచారు. అందుచేతనే వారు ప్రజా యుగకర్త కాగలిగారు. పంతులుగారే ఇప్పుడుంటే సోవియట్ విధానాన్ని తప్పక అంగీకరించిఉందురు". మహీధర జగన్మోహనరావుగారు, పిలకా గణపతిశాస్త్రిగారు మాట్లాడారు. సాయంత్రం 6 గంటలకు జయజయ ధ్వనులమధ్య పంతులుగారి శిలావిగ్రహాన్ని పూలమాలలతో అలంకరించారు. బ్యాండు వాయిద్యాలతో పంతులుగారి పటాన్ని ముఖ్యవీధుల గుండా ఊరేగించారు. సాయంత్రం 7 గంటలకు వివిధసంస్థల యాజమాన్యాన శ్రీ. కామరాజు హనుమంతరావుగారి అధ్యక్షతను, పంతులుగారి హైస్కూలుహాలులో సభ జరిగింది. అభ్యుదయ రచయితలు, యువకులు ఈ కార్యక్రమాన్నింత జయప్రదంగా నిర్వహించినందుకు ఉపన్యాసకుల అభివందనలందారు. సంగీత ప్రదర్శనలతోను, ప్రహసనాలతోను నాటి కార్యక్రమం ముగిసింది.

సర్వత్రా

రాజమండ్రిలో ప్రదర్శింపబడిన ఉత్సాహం అక్కడ వ్యక్తమయిన భావాలు వర్ధంతి జరిగిన అన్నిచోట్ల వెల్లడయ్యాయి. ఇంచుమించు అన్నిచోట్ల వారి ప్రహసనాలు ప్రదర్శింపబడ్డాయి. వారి జీవిత విశేషాలు బుర్రకథగా చెప్పబడ్డాయి, పంతులుగారు ప్రజల కోసం జీవించారు. ప్రజల జీవితంతో, అభివృద్ధికోసం అనుదినం జరిగే ప్రజాపోరాటంతో, వారిజీవితం పెనవేసుకుపోయింది. అందువల్లనే వారికి అమరత్వం సిద్ధించిందనే భావాన్ని ప్రముఖులు వెల్లడించారు. కాకినాడలో అమితోత్సాహంతో జరిగిన వర్ధంతి సభకు అధ్యక్షత వహిస్తూ శ్రీముద్దుకృష్ణగారు ఇలా అన్నారు : "వీరేశలింగంగారు తన కాలంనాటి ప్రజల సమస్యలను తీసుకొని కృషిచేశారు. ఆ విధంగా వారు ప్రజల స్మృతిపథాల్లో శాశ్వతస్థానం సంపాదించుకున్నారు. నేడు మన జీవిత సమస్యల పరిష్కారానికై కృషిచేయడమే వారి సాంప్రదాయాన్ని కొనసాగించడ మవుతుంది." కామ్రేడ్ సి. వి. కె. రావు ఈ భావాన్నే బలపరిచారు.

నెల్లూరులో వివిధ సంస్థల ఆధ్వర్యాన వర్ధంతి ఎంతో ఉత్తేజకరంగా జరిగింది. సుప్రసిద్ధ కాంగ్రెసు ప్రముఖులు శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు మహాసభకు అధ్యక్షతవహించారు. వారిలా అన్నారు : "వీరేశలింగంవంటి నవయుగ నిర్మాతలు కావాలి. నేడు మనలనెదుర్కొంటున్న అనేక సమస్యల్ని పరిష్కరించే దక్షులు కావాలి." పోరుగంటి వెంకటసుబ్బయ్య (యం. యల్. ఏ.)గారు, కామ్రేడ్ అమంచర్ల గోపాలరావు మొదలయినవారు బహుముఖాలుగా సాగిన పంతులుగారి కృషిని విశదీకరించారు.

బెజవాడలో ఆనాటిసభకు పంతులుగారి శిష్యులు, అనుచరులు, ఆప్తులుఅయిన డాక్టరు ఆచంట లక్ష్మీపతిగారు అధ్యక్షతవహించారు. శ్రీ విశ్వనాథ సత్యనారాయణ, డాక్టరు కొమర్రాజు అచ్చమాంబ, మాడభూషి వెంకటాచారిగార్లు ఉపన్యసించారు. సమాజంలోని కుళ్ళును కడిగివేయడానికి పంతులుగారు పాటుబడ్డారనీ, ప్రజాసామాన్యానికి విజ్ఞానం చేకూర్చే సాధనంగా సులభశైలిని వాడుకలోకితెచ్చి గొప్ప మేలుచేశారనీ సత్యనారాయణగారన్నారు. మహిళాఉద్యమ నిర్మాతగ వారిసేవను అచ్చమాంబగారు కొనియాడారు. అన్నిరంగాల్లోను వీరేశలింగం ఎలా ముందడుగువేశారో వెంకటాచారిగారు వివరించారు. పంతులుగారు ఈనాడు బ్రతికుంటే కరువు నివారణకోసం, దేశరక్షణకోసం తన సహజదీక్షతో పనిచేసేవారని అన్నారు. "నేడు మనం ఏదారినిబోయినా పంతులుగారి అడుగుజాడలనే నడుస్తున్నాం. ఏవిషయంలోనయినా పునాది వీరేశలింగంవేశారు. మనం ఉన్నది నిజంగా వీరేశలింగ యుగం" అని డాక్టరు లక్ష్మీపతిగారన్నారు.

వ్యక్తి స్వాతంత్ర్యాన్ని నెలకొల్పారు

"వ్యక్తికున్న స్వాతంత్ర్యాన్ని హిందూసంఘం అపహరించింది. దీక్షాబలంతో తిరిగి పంతులుగారు వ్యక్తిస్వాతంత్ర్యాన్ని సంపాదించిపెట్టారు. పంతులుగారు ఒకవ్యక్తి మాత్రమేకాదు. వారొకనిర్మాణసంస్థ" అని శ్రీ కాటూరి వెంకటేశ్వరరావుగారు, కాటూరు (కృష్ణాజిల్లా) లో జరిగిన వర్ధంతిసభకు అధ్యక్షతవహిస్తూ మాట్లాడారు.

అందరికీ పూజ్యులు

ప్రజాసామాన్యం యొక్క సౌఖ్యాభివృద్ధులకు జీవితం అంకితంచేసి, సమాజంలోని సర్వశక్తులూ అందుకొరకే వినియోగింపబడాలనే దీక్షతో కృషిచేసి, అమరజీవి అయిన వీరేశలింగం అందరికీ పూజ్యుడయాడు. వివిధ రాజకీయాభిప్రాయాలవారు, సారస్వతం విషయంలో వివిధదృక్పథాలవారు ఒకే వేదిక నుండి పంతులుగారికి జోహారులర్పించారు.

తిరువూరు (కృష్ణాజిల్లా)లో జరిగిన సభకు ప్రముఖ కాంగ్రెసువాది మురుకుంట్ల వెంకటప్పయ్యగారు అధ్యక్షత వహించారు. "ఈ సభ కమ్యూనిస్టు పార్టీచే జరుపబడుచున్నప్పటికీ, మన సంఘోద్ధారకుని స్మరించుటలో రాజకీయ, తదితర విభేదాలకు తావులేదు. అందరూ పాల్గొనవలసిందే" అని వారు ఉద్బోధించారు. కురుమద్దాలి (కృష్ణాజిల్లా) లో గుళ్ళపల్లి రామబ్రహ్మంగారు, తన ప్రతికక్షులయిన కమ్యూనిస్టుపార్టీవారితో పాటుఒకేవేదికనుండిపంతులుసంస్తుతించారు. నెల్లూరులో బెజవాడ గోపాలరెడ్డి గారు, స్థానికకమ్యూనిస్టులు, ఇతర ప్రజాసంస్థలతో కలిసి వర్ధంతిని జయప్రదంగా కొనసాగించారు. ఏలూరులో వర్ధంతిసభ జిల్లా కాంగ్రెసు నాయకుల్లో ప్రముఖులయిన శ్రీ ఆత్మకూరి గోవిందాచారిగారి అధ్యక్షతను జరిగింది. స్థానికవిద్యార్థి, యువజన, మహిళా సంఘాల ప్రతినిధులు కమ్యూనిస్టుపార్టీవారు పాల్గొన్నారు. ఈ పరస్పర సహకారంవల్ల ఏలూరులో వర్ధంతిఉత్సవం ఎంతో ఉత్తేజకరంగా జరిగింది. సత్తెనపల్లితాలూకా (గుంటూరుజిల్లా) లోని రెంటపాళ్ళలో వర్ధంతిసభకు స్థానిక హెడ్మాస్టరు అధ్యక్షతవహించారు. బాలసంఘంవారు పంతులుగారి జీవితచరిత్రను బుర్రకథ చెప్పారు. మంగళగిరి (గుంటూరు జిల్లా) లో వర్ధంతిసభకు అధ్యక్షులుగా ఉండడానికి సబ్‌మేజస్ట్రీటు అంగీకరించారు.

జరిగిన చోటల్లా విద్యార్థి, మహిళ, యువజన, అభ్యుదయ రచయితల సంఘాలు, ఇతర సారస్వత సంస్థలు పరస్పర సహకారంతో నాయకత్వం వహించి, వర్ధంతిని జయప్రదంచేశాయి. డాక్టర్లు, లాయర్లు, ఉపాధ్యాయులు, విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు, కవులు, పండితులు, సంఘ సంస్కర్తలు, రాజకీయ ప్రముఖులు - అందరూ ఏక కంఠంతో మన వీరేశలింగం గారికి జోహారు లందజేశారు, వీరేశలింగం విడిచిపోయిన సాంప్రదాయాలను కొనసాగించాలని ప్రతిజ్ఞ పూనారు. దీని ప్రాధాన్యతేమిటి? తమ శక్తిసామర్థ్యాలను ప్రజాసామాన్యంయొక్క క్షేమంకోసం వినియోగించాలనే ఆకాంక్ష వీరందరిలోను అంతర్యూతమై ఉందన్నమాట. ఆచరణరూపంలో ఈ ఆకాంక్షను సఫలంచేసిననాడే వీరేశలింగం ఋణం మనం తీర్చగలం. అప్పుడే వారి సాంప్రదాయాలను వన్నె తరుగకుండా కాపాడినవార మవుతాము.

వర్ధంతి జరిగిన ప్రదేశాలు

విశాఖపట్టణం.

తూర్పుగోదావరిజిల్లాలో : కాకినాడ, అమలాపురం, ముంగండ, ఏనుగుల మహల్, మండపేట, అంతర్వేదిపాలెం, రామచంద్రపురం, రాజమండ్రి, కొత్తపల్లి.

పశ్చిమగోదావరిజిల్లా : ఏలూరు, దండగర, మాధనరం, అప్పారావుపేట, ఎండగండి, గొల్లలకోడేరు, కొండెపాడు, భీమవరం, రాయలం, వీరవాసరం, అప్పారావుపేట, పాలకొల్లు, జిన్నూరు, వాలమర్రు, చింతలపూడి, కొక్కిరపాడు, చేబ్రోలు, (తా. గూడెం తాలూకా)

కృష్ణాజిల్లా : బందరు, బెజవాడ, తిరువూరు, కురుమద్దాలి, పెదతుమ్మడి, నాదెళ్ళవారిపాలెం, కప్తాన్‌పాలెం, నాగాయతిప్ప, ముంగళాపురం, భట్లపెనుమర్రు, పెదనిండ్రకొలను, గూడవల్లి, వీరులపాడు, వెల్దిపాడు.

గుంటూరుజిల్లా : తాడికొండ, రెంటపాళ్ళ, లంకెలకూరపాడు, పణిదం, మంగళగిరి, బాపట్ల, గుంటూరు, భట్టిప్రోలు, వరసాయపాలెం, చిలకలూరిపేట, కొల్లూరు, క్రాప, కణెవరం, చేబ్రోలు, చీరాల.

నెల్లూరుజిల్లా : ఇందుకూరు, వెంకటగిరి, తలమంచిలి, నెల్లూరు, గూడూరు.

అనంతపురంజిల్లా : హావళిగిరి, యాగవల్లె, గుంతకల్లు.

11వ నైజాంరాష్ట్ర ఆంధ్ర మహాసభ సందర్భంలో భువనగిరిలో వీరేశలింగం వర్ధంతి జరుపబడింది.

ఓ కందుకూరి పంతులయ్యా

(ఓ పల్లెటూరి పల్లెకాపా మాదిరి)

ఓ కందుకూరి పంతులయ్యా
అందుకో మాధన్యవాదాలు

ఆంధ్రభూమిని నీవునాటిన
అన్నిసంస్కారోద్యమాలు
దివ్యసుమముల విరిచినిండెనుగా
ఓసంఘ సంస్కారాభిలాషి
అవతికాలములోనె పండునుగా॥

మూఢులౌ ఆచారవాదుల
మూకలన్నీ ఎదురునిలువగ
భయములేకనె సంస్కరించావూ
ఓ తెరువెరింగిన దూరదర్శీ
మాతృభూమిని ఉద్ధరించావూ॥

స్త్రీ పునర్వివాహ పద్ధతి ధర్మసమ్మత
మంచు దెలిపిన
ఆదిమూర్తివి నీవెకావయ్యా
ఓ జడుపెరుంగని ధర్మవర్తీ
బల్లగుద్ది పలికినావయ్యా॥

అబలకు స్వాతంత్ర్యమంటూ
అన్నిహక్కులు సమమెనంటూ
మొదటమ్రోగిన గంటనీదేనోయ్
ఓ స్త్రీజనోద్ధరణాభిలాషీ
సుదతులకు సత్పితవు నీవేనోయ్॥

తెలుగు కవితలో పోజు, పద్ధతి నవ్యతవులకు
తెన్నుజూపిన
నక్కవీంద్రుడ నీవెకావయ్యా
ఓ నవ్యసాహిత్యాలంకారా
కవికుమారుల వందనములయ్యా॥

విధవలకు పెళ్ళిళ్ళు జేయగ అధము
లెందరో అడ్డుదగులగ
ధృతిచలించక నిల్చిపోరావూ
ఓ సాటిలేనీ మేటి సాహసి
ఢంకమీద కొట్టి గెల్చావు॥

ఎన్నో ధర్మము లందజేసితి వెన్నోవిధముల
పాటుబడితివి
నీదురుణమును తీర్చలేమయ్యా
ఓ అంతులేనీ జ్ఞానమూర్తీ
మాదు జోహార్లందుకోవయ్యా॥

నీవుపెట్టి జ్ఞాన భిక్షయె నేటికిని
మా హృదయపుటముల
ఆరిపోవని జ్యోతివయ్యె వెలిగెన్
ఓ నవయుగ నిర్మాతనీవు
అమరకీర్తిని గాంచినావిలలోన్॥

— ము. సీతారామాచార్యులు, కురుమద్దాలి

బెజవాడ-జగ్గయ్యపేట బస్‌సర్వీసు వర్కర్ల కష్టాలు

మన ఆంధ్రదేశంలో చాల జిల్లాలలో రాకపోకలకు బస్సులే ముఖ్యఆధారం. ఇప్పటి యుద్ధపరిస్థితుల్లో రైళ్ళపై ఒత్తిడి హెచ్చడం వల్ల రైళ్ళున్న ప్రాంతాల్లోకూడా బస్‌సర్వీస్ ప్రాముఖ్యత మరింత అధికమయింది.

ఈ బస్సులలో పనిచేయు వర్కర్ల పరిస్థితులు చాలా దారుణంగావున్నాయి. పోలీసు జులూంకు, యజమానుల దురాశకు యీ వర్కర్సు బలి అవుతున్నారు.

వీరి జీతాలు చూద్దాం. కండక్టరుకు లైను మీద రు 25 జీతం, రోజుకు 4 అణాలు బేటా. రు 15 జీతం, 3 అణాల బేటా గల కండక్టర్లు కూడాఉన్నారు. క్లీనర్లకు రు 8 జీతం 1 అణా బేటా మొదలు రు 15 జీతం 3 అణాలు బేటా వరకు మాత్రమే యిస్తారు. డ్రైవర్లకు రు35 జీతం. చెకింగు ఇనస్పెక్టర్లుపనిలో చేరేటప్పుడు రు 40 లు డిపాజిట్టుకట్టాలి.

ఈ జీతాలమీద యజమానులు జరిమానాలువేసి, మినహాయింపులుచేసి, జీతాలు యిస్తారు. ఈ జరిమానాలు పేమెంటు ఆఫ్ వేజస్ ఆక్టుకు విరుద్ధం.

కండక్టర్లు అణో, బేడో, అపహరించారని నేరం మోపి, అందుకు రు 5 లు జరిమానా అంటారు. చకింగు ఇన్‌స్పెక్టరు రాత్రి 9-30 లకు బస్‌ను ఆపమన్నప్పుడు ఆపలేదని రిపోర్టుచేస్తే అందుకు రు 4 జరిమానా. ఇంతే కాకుండా యజమానులు డ్రైవర్లను కొట్టడం కూడ కద్దు. ఒక చకింగు యిన్‌స్పెక్టరు మిగిలిన పనివారలకు అనుకూలంగా వున్నాడని అతనిని పనిలోనుండి తొలగించారు.

యూనిఫారాలు

పనివారలకు యూనిఫారాలు యజమానులే సప్లయి చెయ్యాలి, కాని యజమానులు యిందుకు పూనుకోరు. యూనిఫారాలు లేకపోతే పోలీసుకేసులుపెట్టి రు. 5 లు మొదలుకుని రు. 20 లు వరకు జరిమానాలు విధించుతారు. ఈ జరిమానాలు పనివారలు భరించవలసినదే. పోలీసు జవాను దగ్గరనుంచి తహసిల్దారు వరకు యీ వర్కర్సుమీద జులుం సాగించేవారే.

ఏలాంటి సౌకర్యాలులేవు

ఇక వీరికి విశ్రాంతి అనేదే లేదు. కరువుభత్యం విషయం తలపెట్టటానికే వీలులేదు. యజమానులు వ్యక్తిగతంగానే కాకుండా తమ సంఘంద్వారాకూడా వర్కర్సుపై నిరంకుశత్వం సాగిస్తున్నారు.

ఈ పరిస్థితులలో బస్‌సర్వీసులోని వర్కర్సుకి జీవితం గడపడమే దుస్సాధ్యంగా వుంటున్నది.

సంఘ అవసరం

బస్సు పనివారల యిబ్బందులు పోవాలంటే పనివారల సంఘమేర్పర్చి, దానిద్వారా కృషి చేసిననాడే పోగలవు. బస్సుయజమానులు సంఘమేర్పర్చుకొని, పనివారలమీద దాడి సాగిస్తున్నారు. దానిని పనివారు తమ సంఘ బలం ద్వారానే ఎదుర్కోగలరు. తమ హక్కులను కాపాడుకోవడమే కాకుండా, కార్మికులు తమ సంఘంద్వారా ప్రజలకు కూడా సౌకర్యం కలిగించగలరు ప్రయాణము యిబ్బంది అయ్యే యీరోజుల్లో బస్సు రాకపోకలు సక్రమంగా సాగించి ప్రజలకు ప్రయాణభీతి, ఆతురత తగ్గించడము, కార్మిక సంఘము చేయగలమేలు. కనుక, బస్సు ప్రయాణీకులుకూడ పనివారల హక్కులను బలపర్చి వారిజీవిత సౌకర్యాలకు సాయము చేయుట ఎంతైన అవసరము.

30-5-44 తేదీని జగ్గయ్యపేటలో కామ్రేడ్ వి. వి. కె. రావు అధ్యక్షతక్రింద బెజవాడ జగ్గయ్యపేట బస్సువర్కర్లసమావేశమై కృష్ణాజిల్లా మోటారు ట్రాన్సుపోర్టుపనివారల సంఘమును స్థాపించుకున్నారు. జిల్లా సంఘముయొక్క నిబంధనలు,రూల్సు ఆమోదించి ట్రేడ్ యూనియను ఆక్టుక్రింద రిజిష్టరు చేయుటకు తీర్మానించారు.

రైల్వే పనివారి ఆందోళన

రైల్వేవర్కర్లకువస్తువులను సప్లయిచేయటానికి కొద్ది కేంద్రాలలోనే చవుకడిపోలు వున్నయి. మిగతా ప్రదేశాలలో పనిచేసే పనివారికి సప్లయి చేయటానికి గాను స్టోర్‌వ్యాన్ అనేది అన్ని ప్రదేశాలకు వెళ్లతుంటుంది. లైన్‌మీద స్టాఫ్‌కు సప్లయిచేయటానికిచాలినన్ని స్టాకులను రైల్వే మానేజిమెంటు పంపకపోవటంవనివారలు కొనుక్కోవలెనంటె. కొన్నివస్తువులు నిర్ణయించబడిన రేషన్‌కాకుండా దాంట్లో సగమే యివ్వబడుతుండటం, తప్పుడుకొలతలు, తప్పుడుతూకం మొదలగు అసంతృప్తికరమైన విషయాలు జరుగుతున్నయి.

అధికారులు గుడివాడలో, భీమవరంలో చవుకడిపోలు తెరుస్తామని యింతవరకు తెరవలేదు.

గుడివాడ,కైకలూరు, ఆకివీడు, భీమవరం సెంటర్లలో బహిరంగసభలు జరిగాయి. 200 మంది పనివారలు హాజరైనారు. రైళ్లరాకపోకలవిషయంలో పనివారల బాధ్యతలను కూడా స్పష్టపరిచారు.

భీమవరం మీటింగులో, 7 గురుతోకూడిన స్టేషన్‌కమిటీని యేర్పాటుచేయటం జరిగింది. అధికారులు యూనియన్ ఆహారకమిటీలను గుర్తించి పూర్తిసహకారం తీసుకొనవలసినదని, పనివారల కుటుంబాలలో సభ్యులందరికీ కాకుండా కొంతమందికే వస్తువులను సప్లయి చేసే కొత్త పద్ధతిని రద్దుచేసి కుటుంబంలోని అందరికీ సప్లయిచేయాలని తీర్మానాలు జరిగాయి.

వెందోడులో

నెలకొకసారి ఆహారపదార్థాలు సప్లయి చేసేబండి పాకాలనుంచిబయలుదేరివెందోడు (గూడూరునుంచి రెండవస్టేషను) చేరేసరికి రాత్రి 2 అవుతుంది. పగలంతా పనిచేసి, అంతవరకు కాచుక్కూర్చోవడంతోనేమి. ఆ రాత్రిపూట గుడ్డిలాంతర్ల కుదుగున, తప్పుడు కొలతలతో బండిలోని గుమస్తాలు చేసేమోసాలతో నేమి పనివారుచాలా ఇబ్బంది పడుతున్నారు. రేషన్ కోటాలయినా సరిగా అందడంలేదు. వీటిని సహించలేక గతమాసం 17 వ తేదీని రాత్రివచ్చిన బండిని ఉదయం వరకు నిలపాలని, ఉదయంగాని సరుకుతీసుకోమని,కార్మికులు స్టేషన్‌మాష్టరుపై ఒత్తిడి తెచ్చారు. ఇంతలో యూనియన్ కార్యదర్శి అక్కడికివచ్చాడు. బండిని ఆపడంవల్ల బొగ్గు అనవసరంగా ఎక్కువఖర్చు అవుతుందని. డ్రైవరు, గార్డులు ఇబ్బందిపాలవుతారని తెలుసుకొన్నాడు. సక్రమంగా సరుకులు సప్లయి చేయించడానికి అధికారులచేత, అపూటే సరుకుతీసుకోడానికి కార్మికులచేత ఒప్పించాడు. అలాగే జరిగింది. ఎలాంటి అక్రమంలేకుండా సరుకు అందడం ఆవేళనే అని కార్మికులు సంతోషించారు. ఇంతటితో ఇబ్బందులు తీరిపోవు. లైనుమీద గ్యాంగిపనివారలకు చిన్న స్టేషన్లలోని పనివారికిసరుకు తెచ్చుకోడానికి కార్డుప్యాసు సౌకర్యాన్ని వెంటనే అమలు జరపాలి.

ఎమ్. ఎస్. ఎమ్. రైల్వే పనివారల సంఘ రజతోత్సవము

ఎమ్. ఎస్. ఎమ్. రైల్వే పనివారల సంఘం స్థాపించి ఇప్పటికి 25 సవత్సరము లయింది. కనుక సంఘరజతోత్సవము జూన్ నెలాఖరున జరుపుటకుగాను ఒక ఆహ్వాన సంఘం ఏర్పడింది. రజతోత్సవంతోపాటు, బిట్రగుంట బ్రాంచి వార్షికోత్సవంగూడా జరుపబడుతుంది. ఆహ్వానసంఘానికి శ్రీ వి. సుబ్బరామయ్యగారు అధ్యక్షులు, మజీద్‌ఖాన్‌గారు కార్యదర్శి. మరి 11 గురు సభ్యులు ఎన్నుకోబడ్డారు. ఉత్సవమునకు శ్రీబెజవాడ గోపాలరెడ్డిగారు ఇతర ప్రముఖనాయకులు ఎందరో ఆహ్వానింపబడ్డారు. బ్రాంచి వార్షికోత్సవం కొరకుప్రతినిధుల ఎన్నికలు లైనుమొత్తంమీద జూన్‌నెలలో జరుపబడతాయి.

రాష్ట్ర ప్రెస్‌వర్కర్స్ యూనియన్ నిర్ణయాలు

ఆంధ్రరాష్ట్ర ప్రెస్‌వర్కర్సు యూనియన్ కార్యనిర్వాహకవర్గం 27-5-44 న ఏలూరులో సమావేశమయింది. యూనియన్ అధ్యక్షుడు ఇల్లూరు తాతయ్యగారు అధ్యక్షత వహించారు. స్థానిక యూనియన్ రిపోర్టులతో సభ ప్రారంభమయింది. ఇంచుమించు అన్నిచోట్ల కోటాలను మించి సభ్యులను చేర్పించారు. తెనాలిలో తీసుకొన్న కోటా 60 మందిని చేర్పించడం. చేర్చిన సంఖ్య 70. బెజవాడలో కోటా ప్రకారం 160 మందిని చేర్పించారు. ఏలూరులోకూడా కోటాను మించారు - 80 మందిని చేర్పించారు. బందరులో 30 మందిని చేర్పించారు.

బెజవాడ రిపోర్టు సభ్యుల నందరిని ఎంతో ఉత్తేజపర్చింది-వారందరికి ఆదర్శమయింది. పనివారికి, యజమానులకు వచ్చేతగాదాలను కృతిమించి పోనీయకుండా ఆపి, ఇరువురి మధ్య సామరస్యం కాపాడుతున్నారు. ప్రెస్‌లలో అవుసరమైనప్పుడు పనివారిని సూచించి యూనియన్ యజమానులకు తోడ్పడుతూంది. సభ్యుల విజ్ఞానాభివృద్ధికోసం 200 పుస్తకాలతో ఒక లైబ్రరీని ఏర్పరచారు. యుద్ధ అలవెన్సు విషయం, 'ప్రకాశక్తి' ప్రెస్‌లో రు 10 లు ఇచ్చారు. మిగతా ప్రెస్‌లలో రు 5 కు తక్కువలేకుండా ఇస్తున్నారు.

తక్కిన స్థానిక యూనియన్లు రు 2 మొ॥ రు 5 వరకు అలవెన్సు సాధించాయి. ప్రభుత్వం ప్రకటించిన రు 10 ల కరువు భత్యం సాధించుటకు కృషిచేయ నిశ్చయించుకున్నారు.

రిపోర్టుల తరువాత తీర్మానాలు జరిగాయి. మహాత్ముని విడుదలకు సంతోషిస్తూ, రాజకీయ సమస్యాపరిష్కారానికి వారు త్వరలో కృషిచేస్తారని ఆసిస్తూ ఒకతీర్మానం. చిట్టివలస కార్మికనాయకుల అరెస్టును ఖండిస్తూ ఏలూరులో జూట్‌మిల్లులో 7 గురు కార్మికులను, సీతారామాంజనేయ ప్రెస్‌లో రాఘవయ్యను తొలగించుటను నిరసిస్తూ తీర్మానాలు చేశారు. అక్రమాలను ప్రభుత్వం వెంటనే సరిచేయాలని కోరారు.

ప్రెస్‌వర్కర్సు సెలవులేకుండా పనిమానడంగాని, ఆలస్యంగా పనిలోకి వెళ్ళడంగాని కూడదని హెచ్చరించారు. పనిలోనుంచి మానదలచుకొన్నప్పుడు యజమానికి 15 రోజుల నోటీసుయివ్వాలన్నారు. యజమానులతో ఘర్షణవస్తే యూనియన్‌కి తెలియజేయాలన్నారు. సిరా, కాగితం, మెషిన్లను జాగ్రత్తగా వాడాలన్నారు.

రాష్ట్రయూనియన్ స్థాపకుల్లో ఒకరైన కామ్రేడ్ సి. హెచ్. వెంకటేశ్వరరావు స్మారకచిహ్నంగా ఒక పతకం చేయించి, రాష్ట్రయూనియన్ బ్రాంచీలలో బాగా పనిచేసినదానికి మహాసభ సందర్భంలో యివ్వడానికి తీర్మానించారు.

కొత్త ప్రచురణాలు

యుగోస్లావియా	
- స్వాతంత్ర్యపోరాటం	రు 0-8-0
తాతా బిర్లా ప్లాన్	0-3-0
8 వ అఖిలభారత రైతుమహాసభ	0-8-0
స్త్రీల పాటలు	0-2-0
నేటి సోవియట్ యూనియన్	3-0-0
సోవియట్ విదేశాంగనీతి :	
భారతదేశం	0-10-0

ప్రజాశక్తికార్యాలయం, బెజవాడ

గుంటూరు జిల్లాలో ఆహారపరిస్థితి ప్రజల కర్తవ్యం

— వి. శ్రీకృష్ణ

ప్రస్తుత పరిస్థితుల్లో ఆహారసమస్యాపరిష్కారానికి, ప్రజలక్షేమానికి, ధరల కంట్రోలు, రేషనింగు ఎంలో అవసరం. ప్రజల బాగునుకోరే ప్రతివ్యక్తి, ప్రతి సంస్థ ఈరెండింటికి అనుకూలం. అన్ని విధాలా వీటిని కొనసాగించటానికి పాటుబడతాయి. స్వార్థపరులు వీటికి వ్యతిరేకులు. వారి పన్నాగాల కేమాత్రం అవకాశమిచ్చినా ఆహార సమస్య మరింత తీవ్రమవుతుంది.

ఆహారపదార్థాలు అదనంగా పండే ప్రాంతాల్లో గుంటూరుజిల్లా ఒకటి. తెనాలి, రేపల్లె తాలూకాలు స్థానికావసరాలకు మించి పండుతాయి. బాపట్ల తాలూకా స్వయం సంపూర్ణం. మిగతా మెట్ట తాలూకాలు కొద్దో గొప్పో కొరత ప్రాంతాలు. పల్నాడు, వినుకొండలు దిగుమతులమీదనే ఆధారపడి ఉంటాయి. మొత్తంమీద తరుగు ప్రాంతాల కొరతను తీర్చగలవు మాగాణి ప్రాంతాలు.

ఇలాంటి గుంటూరు జిల్లాలో ఆహార పరిస్థితి విషమించే సూచనలు కనుపించాయి. సుమారు మూడు మాసాల క్రిందట ధాన్యాదుల ధర పెరగ నారంభించింది. బస్తీల్లో బియ్యంధర బీదల కందకుండా పోయింది. పరిస్థితుల పోకడను గుర్తించి, జిల్లాకలెక్టరు ధరలను కంట్రోలు చేశారు.

వర్తకుల ఎదురుదాడి

ధరలను నిర్ణయించారేగాని సరుకు సప్లయికి, సరఫరాలకు తగిన ఏర్పాట్లు చేయలేదు. దురాశాపరులకు అవకాశం చిక్కింది. సరుకంతా దాచేశారు. ధరలు పెంచి, అధిక లాభాలు గుంజసాగారు. నరసారావుపేటలో బియ్యం బస్తా రు. 48 లకు మించింది. మిగతా పట్టణాల్లో రు 35 లు దాటింది. గుంటూరులో మిల్లులున్న షాహుకార్లంతా సరుకు బిగపట్టేసరికి బ్రాంచి కొట్లన్నీ బస్తా రు 33 లకు బహిరంగంగానే అమ్మసాగాయి. ఎప్పుడూ కూడా ఎక్కువగా ఖర్చుగాని ఆడవారకం సరుకంతా అధిక ధరలకు విడుదల చేయ సాగారు. పట్టణాల్లో ప్రజలు బియ్యంకోసం అల్లాడి పోనారంభించారు. బీదబిక్కి పస్తులున్నట్లు వార్తలు వచ్చాయి. బాపట్లలో భీమావారి వీధిలో ఇద్దరు బాలింతలు ఆకలితో మాడిపోతూంటే - ఎంత తిరిగినా బియ్యం దొరకలేదు. శోషవచ్చి వాళ్లిద్దరూ పడిపోయారు. పరిసర గ్రామాలనుండి, తిండిలేక అలమటిస్తున్న నలుగురు బాలెంతలను నరసారావుపేట తహసీల్దారు వద్దకు తీసుకుపోతే-ఏమైనాసరే షావుగూళ్లకు పర్మిట్లుఇవ్వనని మొండిగాసమాధానం చెప్పాడు. ఈ తీవ్రపరిస్థితుల నాధారం చేసుకొని దొంగ వ్యాపారులు కంట్రోలుకు వ్యతిరేకంగా ప్రజల్లో ప్రచారం ప్రారంభించారు.

ప్రజాసేవకుల చొరవ

వీటన్నిటి ఫలితంగా కంట్రోలు భగ్నమయి, అసలైన రేషనింగుకి అవకాశంలేకుండాపోయే పరిస్థితు లేర్పడ్డాయి. ఇది ప్రజలకు మరింత ప్రమాదకరం. ఈ ప్రమాదాన్ని గుర్తించి ప్రజాసేవకులుచొరవతీసుకొన్నారు. తిండిదొంగలదురాగతాలను, స్థానికాధికారుల అవకతవకలను అరికట్టి కంట్రోలు, రేషనింగు జయప్రదంగా అమలుజరపడానికి కృషి ప్రారంభించారు. గుంటూరులో పుర ప్రముఖులంతా సమావేశమై ప్రజా ఆహార కమిటీ నేర్పరిచారు. త్వరలో రేషనింగు అమలు జరపాలనీ, పట్టణానికి చాలినంత స్టాకు నిలవజేయాలనీ ప్రభుత్వానికి సలహా యిచ్చారు. ఈ నిలవకోసం రైతులు తమ వద్దనున్న అదనపు ధాన్యాన్ని అమ్మటానికి ఉత్సాహంగా ముందుకు రావాలంటే రైతుకు గిట్టుబాటయ్యేటట్టు ధాన్యం ధర రు. 11 లకు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈసూచన ప్రకారం జిల్లాకలక్టరు ధాన్యం ధర రు. 11-9-0 (గోతాలతోసహా)నిర్ణయించారు. గుంటూరు పట్టణానికి కావలసిన బియ్యం తెనాలిలో కమాండీరు చేయించి గుంటూరుకు తెప్పించారు. ఈ సందర్భంలో బాడుగబండ్లు దొరక్క డిప్యూటీ కలక్టరు, బజారునబోయే బండ్లను నిర్బంధించబోతే తాలూకారైతు సంఘం జోక్యం కలిగించుకొని ప్రక్కగ్రామాలనుంచి బళ్ళుసప్లయి చేసింది. వచ్చిన ధాన్యాన్ని గుంటూరులో వలంటీర్లు సక్రమంగా అమ్మించారు.

నరసారావుపేటలో కూడా ఇలాగే నానాటికి తీవ్రమవుతూన్న పరిస్థితుల నెదుర్కోడానికి స్థానికప్లీడర్లంతా పూనుకొని, ఆహారకమిటీనేర్పరిచారు. టోకువర్తకులు సరుకును బిగబట్టుకొని కూర్చుంటే, చిల్లరవ్యాపార్లంతా ఉన్నంతవరకు 'లేదు'న కుండా ప్రజలకు అందజేశారు. బాపట్లలో స్థానికవర్తకులు కూడా ప్రజాసేవకులకు తోడ్పడ్డారు. సత్తెనపల్లిలో స్థానికాధికారుల ప్రవర్తన దొంగవ్యాపారానికి అనుకూలంగా ఉంటే, ఆహారకమిటీ ద్వారా దాన్నరికట్టారు. కొన్నిచోట్ల దొంగస్టాకుల్ని బయటికిలాగి, అమ్మించారు. రహస్యంగా ఇతరప్రదేశాలకు చేరవేస్తున్న సరుకును వలంటీర్లు పట్టుకున్నారు.

అవకతవకలు

ప్రజాసేవకుల ఈకృషి ఫలితంగా కొంత ఉపశమనం కలిగింది. కాని అంతటితోనే సంతృప్తిచెంది ఊరుకుంటే, పరిస్థితులు ఎదురుతిరగవచ్చు. కాబట్టి జిల్లామొత్తంమీద ఒక సమగ్రమైన ప్లానుతో పనిచేయాలి. ముందుముందు పట్టణాల్లో రేషనింగు పెట్టబోతున్నారు. దానికోసం మాగాణి ప్రాంతాల్లో కమాండీరుచేయాలి. ప్రభుత్వోద్యోగులు ఈ పనిని ప్రారంభించారు. కాని ఈ విషయంలో ఎన్నో అవకతవకలు చేస్తున్నారు. రైతుఅవసరాలను,గ్రామఅవసరాలను గుర్తించడంలేదు. కమాండీరు చేసిన ధాన్యాన్ని దగ్గరలోఉన్న మిల్లులకు పంపకుండా దూరాన్నున్నమిల్లులకే పంపాలనిఅడుగుతున్నారు. ధాన్యాన్ని తామేమిల్లుచేయించు కొనేఅవకాశాలనురైతుకు కలిగించడంలేదు. ఎక్కువస్టాకు ఉన్నవారు కమాండీరింగునుండి తప్పించుకోగలుగుతున్నారు. బీదా బిక్కికి రక్షణ లేకుండా పోతూంది. ఇలాంటి ప్రవర్తనవల్ల రైతుల్లో విముఖత పెరిగి, కమాండీరింగుకు, తద్వారా రేషనింగుకి దెబ్బ తప్పదు. ఆహార సమస్య పరిష్కారం కావడానికి బదులు మరింత తీవ్రం కాగలదు.

గోరుచుట్టుపై రోకటిపోటు

ఆహారసమస్యకు తోడయింది కట్టెల సమస్య. గుంటూరులో దొంగమార్కెట్‌రేటు టన్ను 1 కి రు. 65 లు కూడ వుంది. తెనాలిలో ఈ మధ్య రు 80 వరకూ పెరిగింది. ఇప్పుడు రు 60 లో నిలబడింది. కిరసనాయిలు సమస్య కొన్నిచోట్ల తిరిగి తలెత్తుతూంది.

మరోవైపునుండి అంటువ్యాధులు విజృంభిస్తున్నాయి. మలేరియా జిల్లాఅంతటా విపరీతంగా వ్యాపించింది.

ఈ పరిస్థితుల్లో ప్రజలు, ప్రజా సంస్థలు, ప్రభుత్వం పరస్పర సహకారంతో ప్రజల ఇబ్బందులను తీర్చడానికి పూనుకోవాలి. లేకపోతే బెంగాల్లోని భయంకర దృశ్యాలను కొన్ని ప్రాంతాల్లో నయినా చూడవలసి వస్తుంది. పల్నాడు, వినుకొండ తాలూకాల్లోను, సత్తెనపల్లె - ఒంగోలు తాలూకాల్లో కొన్ని ప్రాంతాల్లోను పండినపంట కొద్ది రోజుల్లోనే లేకుండా పోయి, గంజినీళ్ళ కూడా కరువు రాబోతుంది. తెనాలి, రేపల్లె లున్నాయికదాఅని సంతృప్తిపడితే, ప్రమాదం తప్పదు.

ప్రజాసేవకుల కర్తవ్యం

జిల్లాలోని ముఖ్యులంతా, అన్ని పార్టీలకు సంబంధించనవారూ, మనల్నెదుర్కొంటున్న ఈ సమస్యలను పరిష్కరించటానికి పూనుకోవాలి. వెంటనే వివిధపార్టీల ప్రాతినిధ్యం గల జిల్లా ఆహారకమిటీని ఏర్పరచి, వివిధ తాలూకా కమిటీలను కూడా ఏర్పరచి, జిల్లా అంతటాసమగ్రమైనప్లానును అనుసరించాలి. గుంటూరు, నర్సారావుపేట, బాపట్ల, సత్తెనపల్లి మొదలగు పట్టణాల్లో ప్రముఖులంతా ఇందుకు సుముఖులుగా వున్నారు. స్థానికంగా అన్నిచోట్ల ఆహారకమిటీ లేర్పడితేనే, సమస్యాపరిష్కారం సులభసాధ్యమవుతుంది. ప్రజాసేవకులంతా ఏకబాటను సాగిపోగలరు. కమాండీరింగు, రేషనింగు, పంపకం మొదలైన విషయాల్లో ఏలాంటి అవకతవకలు లేకుండా సరిదిద్దడానికి ప్రయత్నించగలం. స్వార్థపరుల పన్నాగాలను అరికట్టగలం. ఇందుకు తగినంత వలంటీరుదళాన్ని జిల్లా వ్యాపితంగా నిర్మించడం అవసరం.

పట్టణ, పల్లె ప్రజలమధ్యఎంతైనా సుహృద్భావముంది. ఈ సామరస్యాన్ని సుస్థిరం చేయాలంటే,సోదరప్రజలశ్రేయస్సు,దృష్టిలో ఉంచుకొని, రైతు తనవద్దనున్న అదనపు ధాన్యాన్ని పట్టణప్రజలకు, కరువుప్రాంతాల ప్రజలకు కంట్రోలురేటుకి అమ్మాలి. ఇనుప సామాను, బట్టలు వగైరా వస్తువులు చౌకధరలో రైతుకందేలా ప్రజలంతా ఆందోళన చేయాలి. ఇలాంటి ఐక్యప్రకాశక్తికి ఎదురేముంటుంది?

దీనిని వెంటనే అరికట్టాలి

సత్తెనపల్లి ఆహారకమిటీ ఆందోళన ఫలితంగా జిల్లాకలెక్టరు పట్టణంలో 6 కంట్రోలుడిపోలు పెట్టించి, బియ్యం రు1-0-3కి 4 శేర్లుచొప్పున అమ్మిస్తున్నారు. బియ్యం వర్తకుల అధికలాభాలు అరికట్టబడ్డాయి.

వర్తకులంతా ఏకమై ఒక కుట్రపన్నారు. ఆహారకమిటీ వలంటీర్లు జేబులు కొడుతున్నారని నేరంమోపి ఇంగ్లీషులో పిటీషన్ పెట్టారు. ఇంగ్లీషురాని అమాయకులచేత దానిమీద సంతకాలు పెట్టించారు. డిప్యూటీకలెక్టరు నిజానిజాలు ఆలోచించకుండా ఈ పన్నాగంలో పడిపోయాడు. ఆఅయిదు కంట్రోలు డిపోలను మూయించారు. అంతటితో పరిస్థితులు దురాశాపరులయిన షాహుకార్ల చేతుల్లోకి పోయాయి. బియ్యంధర పెంచారు. ప్రతికొట్టుదగ్గర అమ్మకం ప్రారంభించారు. తమ మనుష్యులకే హద్దూపద్దూ లేకుండా అమ్ముతూ సరుకంతా దొంగమార్కెట్టుకే చేర్చుతున్నారు. విషమించి పోతున్న ఈ పరిస్థితులను అరికట్టడానికి డిప్యూటీ కలెక్టరు ప్రయత్నించడం లేదు. పైగా పరిస్థితులను పరిశీలించడానికి వెళ్ళిన ఆహారకమిటీ కార్యదర్శిని తూలనాడడం జరిగింది. ప్రభుత్వం వెంటనే జోక్యం కలిగించుకొని పరిస్థితులను సరిదిద్దాలి.

★

సబ్‌రిజిస్ట్రారుపై కేసు

ఉరవకొండ సబ్‌రిజిస్ట్రార్ సుమారు 3 సంవత్సరాలనుంచి ఉరవకొండలో నివసిస్తున్నారు. అప్పటినుంచి ఆయన ప్రజలను పెట్టిన తిప్పలు వర్ణనాతీతము.

రెజిస్ట్రేషన్ సమయంలో చెల్లించవలసిన రిజిష్ట్రేషన్‌ఫీజు రెట్టింపు వసూలుచేసి ప్రజలను బాధపెట్టుతున్నాడు. ఆయనపైన తాలూకా రైతుసంఘం తరపున కేసుపెట్టబడింది. ఈ కేసు 27-4-44 న బళ్లారిలోను 23-5-44న ఉరవకొండలోను డిపార్టుమెంటల్‌గా విచారణజరిగింది. 20 మంది వరకు సాక్షులు విచారించబడ్డారు.

★


పాతపెదపాడు (ప. గో. జిల్లా) రైతులు మంజూర్‌కొరకు యెరువు దరఖాస్తు ఫారములు తీసుకొని రాజపేట గ్రామకరణంగారైన శ్రీజలసూత్రం మార్కండేయులు గారివద్దకు వెళ్లగా, పట్టామామూలు యిస్తేగాని మంజూర్‌చేయనని బెదరించాడు. పై అధికార్లు తక్షణం విచారించి అవసరమైన చర్యతీసుకోవాలి.

ప్రజాశక్తిచందావివరాలు

★

సంవత్సరం చందా	5—0—0
అర్ధసంవత్సరం చందా	2—8—0
మూడునెల్ల చందా	1—4—0

★ కృష్ణకాలువల మరమ్మతు దృశ్యాలు ★



వూలుపాలెం (రేపల్లెతాలూకా) వ్యవసాయకూలీలు మనిషి ఒక్కింటికి రోజుకి 4 ఘనగజాలు చొప్పున తవ్వారు

బందరు కాలవ మరమ్మతు పని పూర్తి కావస్తుంది. ఒకనాడు కృష్ణాజిల్లా పార్టీ దళాలక్యాంపుకి వెళ్లాను. ఒకదగ్గర కొందరు మాట్లాడుకుంటున్నారు. వారిలో ఒక వృద్ధుడంటున్నాడు: "దేశభక్తి అంటే గుంటూరు జిల్లా వారిదిరా! ఈ స్కీమువల్ల వాళ్ళకు వచ్చే దేమీలేదుకదా? అయినా పిలుపు అందే సరికి ఎంతమంది వచ్చారో చూడు! ఎంత దీక్షతో, ఎంత నిలకడగా పనిచేస్తున్నారో చూడు. చకని ఆదర్శం చూపుతున్నారు!" తక్కినవారంతా ఈమాటల్ని బలపరిచారు. ఈఅభిప్రాయాన్నే ఎన్నోచోట్ల, వేర్వేరు తరహాలవారి నోట విన్నాను. చూచిన వారందరి అభినందనాలను చూరగొంటున్నాయి గుంటూరుదళాలు. స్వప్రయోజనం ఉందాలేదా అన్నదికాదు వారుచూచింది, దేశానికి, ప్రజలకూ, ఎంత ఉపయోగపడుతుందా అన్నదే వారాలోచించిన విషయం. నిజమయిన ప్రజాసేవాదీక్షతో వచ్చి, ఆదర్శప్రాయులయారు. ప్రజోపయోగకరమైన పని ఏప్రాంతంవారి వయినా సరే, ఏతరగతివారి నైనాసరే, దేశభక్తుల్ని తప్పక ఆకర్షిస్తుంది బందరు కాలువపని ఇందుకు లెక్కలేనన్ని నిదర్శనలను చూపింది.

ఉదయ భారతి

'ఉదయభారతి గురుకులం' బెజవాడలోని ఒక జాతీయ పాఠశాల. దీనినిర్వాహకులు శ్రీ పాటిబండ్ల మాధవశర్మగారు. కవి, పండితుడు. సహృదయుడు. అభ్యుదయకరమైన విషయం- సారస్వతరంగంలో కానీయండి, సామాజికం కానీయండి- దేనికైనా చేయూతనిస్తారు. బందరు కాలువపనిని, దానిని కొనసాగిస్తున్న దీక్షను చూచారు. ఉత్తేజితులయారు. తనవంతు సాయం వెంటనే చేయాలనుకున్నారు. ఒకనాడు వేకువజామున తనశిష్య బృందాన్నంతటినీ, తోడి అధ్యాపకుల్ని, వెంటబెట్టుకొని కాలవకు వచ్చేశారు. అందరికీ శక్తికి తగినపని నిర్ణయించారు. తాను పారపట్టారు. ఆదృశ్యాన్ని మరచిపోలేము. మోయగల బాలకులంతా తట్టలు మోశారు. గట్టుపైని ఖాళీ అయిపడుతూన్న తట్టలను, పాలబుగ్గల పసిపాపలు, కేరింతలు కొడుతూ క్రిందికి అందించారు. మరికొందరు బాలికలు మంచినీళ్ళు సప్లయిజేశారు. చుట్టుప్రక్కలవారు ముగ్ధులయిపోయారు. ఒక వైజ్ఞానిక దళం సంతోషం పట్టలేక వచ్చి అరగంటసేపు ఎంతో ముచ్చటగా పాడి, వారి నాహ్లాదపరిచింది.

ఇదే విధంగా పటమటనుంచి ఒక ఉపాధ్యాయుడు 20 మంది బాలకులతో వచ్చి సాయంచేశాడు. గుంటూరు జిల్లానుంచి 3 రు ఉపాధ్యాయులు స్వయముగా పారపట్టి పని చేశారు.

బెజవాడ రైల్వేకార్మికులు కొందరూ, గుంటూరు నుంచి లాగుబళ్ళ పనివారూ, కొందరు వచ్చారు. తమ యింటి అవసరాలకు బియ్యంమోస్తున్నారా అన్నంత ఉత్సాహంతో పనిచేశారు.

'షాప్‌ఎంస్లాయీస్ యూనియన్' సభ్యులు, తోళ్ళపనివారు, మొదలయిన అనేక కార్మిక సంస్థలవారు ప్రతివారం సెలవురోజుల్లో వెళ్ళి పనిచేస్తున్నారు. బెజవాడ ట్రేడ్‌యూనియన్ సంస్థలన్నిటి తరపున వందమందికి పైగా వెళ్ళి ఒకనాడు పనిచేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. "అధికపంటలు పండించి, కరువుకాటకాల నెదుర్కోవలసిన బాధ్యత మీ ఒక్కరిదేకాదు – మా పూర్తి సహకారం ఉంది"ని కార్మికలోకం ఈ విధంగా రైతులోకానికి క్రియారూపంగా హామీ యిస్తుంది. అంతేకాదు. గ్రామ, పట్టణ ప్రజల సామరస్యాని కిదొక అమోఘనిదర్శనం.



సుందరయ్య

మహిళా సంఘం

ఈ పనిలోకి రాడానికి మొదట్లో మహిళా సంఘానికి అనుమతి నివ్వలేదు. కాని, అన్ని వర్గాలవారు శక్తికొలది సాయం చేస్తూంటే, మహిళా సంఘం చూస్తూ ఊరుకోలేక పోయింది. మరమ్మతు కార్యనిర్వాహకులు చివరకు వీరి ఒత్తిడికి లొంగక తప్పిందికాదు. కృష్ణాజిల్లా మహిళాసంఘ కార్యనిర్వాహవర్గ సభ్యులు, రాష్ట్ర ఆర్గనైజరు మానికొండ సూర్యావతి, డాక్టరు అచ్చమాంబ, మానికొండ బుల్లెమ్మ, మొదలైన వారంతా వచ్చి తవ్వి, తట్టలు మోశారు. పురుష దళాలకేమాత్రం తీసిపోరనిపించారు.

చిత్తశుద్ధిగల ప్రజాసేవలో స్త్రీ పురుష విభేదంలేకుండా, ధనిక,బీద, కార్మిక, కర్షక, మేధావి శ్రమజీవి, అనే విచక్షణలేకుండా అందరూ కలిసిరాడానికి అవకాశం ఉంది – తప్పకుండా కలిసివస్తారనే సత్యం ఎన్నో విధాల కృష్ణకాలువ మరమ్మతులో రుజువయింది. విశాల జాతీయరంగానికొక పాఠం ప్రసాదించింది.

అధికారుల సహకారం

ప్రజాసేవకు అన్నివర్గాలవారు, అన్ని తరహాలవారు, కదలిరావడం పి. డబ్లియు. డి. అధికారవర్గాన్ని చకితులను చేసింది. ఈ కార్యక్రమాన్ని జయప్రదంగా కొనసాగించడానికి అన్నివిధాల రైతుసంఘానికి, ప్రజాసేవకులకు, తోడ్పడేలా చేసింది. ప్రజలే చొరవజేసి యిలాంటి ప్రజోపకరాలైన పనులనుచేసి చూపుతూంటే అధికారుల సహకారం సంపాదించవచ్చు ననడానికి యిదొక నిదర్శనం.

స్వార్థపరుల ప్రతిబంధకం

సాఫీగా సాగుతూన్న ఈ పనికి యిసుక కంట్రాక్టర్లుకొందరు కొంత ప్రతిబంధకం అయ్యారు. కాలవలో అక్కడక్కడ పేరుకున్న ఇసుకను త్రవ్వడానికి వీళ్ల కంట్రాక్టు తీసుకున్నారు. ఆ ఇసుకతోపాటు అక్కడున్న సిల్టునుకూడా వీరే తీయాలి. కాని వీరు తమకు లాభంకూర్చగల ఇసుకను మాత్రంతీసి మిగతా సిల్టును వదిలిపెట్టారు.

4 వ తేదీ నాటికి కృష్ణలో ఆనకట్టమీద 6 అడుగుల నీరు వస్తుంది

మిగిలిపోయిన సిల్టునుకూడ తీయించేబాధ్యత రైతుసంఘమే తీసుకొని, సక్రమంగా నెరవేర్చింది.

ప్రజాసేవకుల కార్యదీక్ష, ప్రభుత్వ సహకారం–వీటి ఫలితంగానే రైతుసంఘం ఈనెల మొదటి తేదీనాటికి బందరుకాలువ మరమ్మతు పూర్తిచేయగలిగింది. అనాడు మధ్యాహ్నం కాలవలోకి నీళ్ళు వదిలారు. ఇన్నాళ్ళుగ అక్కడ చమటోడ్చుతూన్న కామ్రేడ్సుకి, రైతులకు, వ్యవసాయకూలీలకు, కార్మికులకు – అందరికీ ఆనాడొక పర్వదినం. శ్రమ శ్రమ ఫలితంగా ఆ నీటిపారుదలకు కొన్ని సంవత్సరాల వరకు ఏలాంటి అంతరాయం ఉండదుకదా అని వారిలో ప్రతి ఒక్కరు ఉబ్బిపోయారనడం అతిశయోక్తి కాదు.

కరువుకాలవ పని

కాని అంతటితో పని పూర్తికాలేదు. ఈస్టుబ్యాంకు కెనాలు (కరువుకాలువ) మరామత్తు ఇంకా వుంది. అదికూడ ముగిస్తేనేకాని సీస్కీమువల్ల పూర్తిప్రయోజనంఉండదు. దానినికూడా పూర్తిచేయడానికి కార్యనిర్వాహకులునిశ్చయించుకున్నారు. అంటేమరోవారం, పదిరోజులు ఆకాలవలోనికి నీళ్ళురావడానికి వీల్లేదన్నమాట. ఆకుమళ్ళు వేసుకున్న రైతులకు కొంత ఇబ్బందన్నమాట అయినా ఈ రైతులు తమతో సహకారం చేస్తారని కార్యనిర్వాహకులు నిండునమ్మకంతో ఉన్నారు. స్వార్థం అణుమాత్ర మయినా ఆలోచించకుండా వందలకొలది రైతుకూలీలు గుంటూరుజిల్లా నుంచివచ్చి పనిచేశారు. పంట నధికంచేయాలనే దీక్షతో తండోపతండాలుగ కార్మికులు, తమ స్వంతపనిగ పాటుపడ్డారు. మేధావులు, మహిళలు, నడుంబిగించారు. ఎందుకోసం? ముమ్ముందు దేశం మరింత సుభిక్షమయి,కరువుకాటకాలకు తావులేకుండా చేయడంకోసమే. నారుమళ్లు వేసుకున్న రైతులు కూడా ఈ దృష్టిని తప్పకనబరుస్తారనే ధైర్యాన్ని అక్కడి ప్రతి ప్రజాసేవకుడు వెల్లడిస్తున్నాడు. ముందు కలుగగల అధికప్రయోజనాల నాలోచించి, ఇప్పటి స్వల్పఇబ్బందులను ఓర్చుకుంటారు. కరువుకాలువ పనిపట్ల సానుభూతి, సహకారాలు తప్పక చూపుతారనీ, నమ్ముతున్నారు.

ఆదర్శసహకారం


ధనికరైతు, కాంగ్రెసువాది అయిన కాట్రగడ్డ రఘురామయ్యగారు ఉత్సాహంతోవచ్చి కాలవపనిలో పాల్గొన్నారు రఘురామయ్యగారి సోదరులు భవాని, నారాయణరావు గార్లు కూడా ఎప్పుడు వీలు చిక్కితే అప్పుడు వచ్చి శక్తికొలది పాల్గొంటున్నారు. రఘురామయ్యగారు తాను పాల్గొనడమే కాకుండా పటమట గ్రామయువకుల్ని పెద్దల్ని కూడా ఉత్సాహపరచి పాల్గొనేలాచేశారు. పటమట నుంచి రైతులుకూడా వచ్చి పనిచేశారు. ఈ స్కీమువల్ల తమకు వెనువెంటనే ప్రయోజనంలేకపోయినా, ప్రజాసేవాతత్పరతే వీరి నిలాప్రోత్సహించింది.



కాలవదృశ్యం — ఒకొక్కచోట అడుగుల లోతు కూడా సిల్టు తీయవలసి వచ్చింది.

పనిచేస్తున్న దళాల పట్లకూడ కార్యనిర్వాహకులు పూర్తివిశ్వాసాన్ని వెల్లడిస్తున్నారు. వడ్డీవుప్పరులు అనుకున్నంతమంది రాలేదు. అందరూ కలిసి వేయిమంది మాత్రమే కరువుకాలవపనికి ఉన్నారు. (కావాలనుకుంది 1500). వీరిలో పార్టీ సభ్యులు, రైతుకూలీ వర్కర్లు కలిసి 250 మంది. కాలవ మరమ్మతు పనిలో రైతుకూలీ దళాలు పార్టీ సభ్యులు ఉత్తేజకరమైన సాంప్రదాయాలను స్థాపించారు. అడుగడుగున బోల్షివిక్ పోటీతో పనిచేసి, అదేవృత్తిగా ఉన్న ముఠాల నెన్నోవిధాల మించిపోయారు. సత్తెనపల్లి, నరసారావుపేట దళాలు ఆదర్శప్రాయంగా నిలచి పనిచేశాయి. వెంట్రప్రగడ దళం మనిషికి 5 ఘన గజాల చొప్పున, ఆత్కూరు దళం 4½ ఘన గజాలు చొప్పున. తవ్వి వుప్పరముఠాలు ముక్కుమీద వేలుపెట్టుకొనేలా చేశాయి.

అంతేకాదు. 30 వ తేదీని ప్రమాదవశాత్తు కాలవలోకి నీరు చొరబడింది. దీనిని కనిపెట్టి



కండలు తిరిగిన దృఢకాయలు
అహోరాత్రులు పనిచేశారు

కార్యనిర్వాహకులు కొన్ని దళాలను వచ్చి కాలవలో కట్టవేయాలని కోరారు. కృష్ణాజిల్లా క్యాంపంతా కదిలింది. వందమందికి పైగా, ఒకరిని మించి ఒకరు పనిచేసి కట్టవేశారు. మరునాడు కట్ట దిగువను పని అతిచురుకుగా సాగింది. ఆనాటి రాత్రికి పనంతా పూర్తి చేయాలనే దీక్ష సర్వత్రా కనుపించింది. మధ్యాహ్నం – భోజనాలప్పుడే అయాయి. విశ్రాంతి తీసుకోబోతున్నారు. అంతలో మళ్లా పిలుపు వచ్చింది – అడ్డుగా వేసిన కట్ట తేగేలాగుంది. దాన్ని బలపరచడానికి రావలసిందని. క్షణం ఆలశ్యం చేయకుండా కట్టా, పారా పట్టుకొని కామ్రేడ్సు బయలుదేరారు. అప్పటికప్పుడే కొందరక్కడ పనిచేస్తున్నారు. భోజనానికివస్తూ, దారిలో పరిస్థితిని కనిపెట్టి పనిలోకి దిగారు వారు. వీరూ వారూ కలిసి కట్టనుబలపరిచారు. ఈ విధంగా సమయాసమయాలు చూడకుండా, అలసటను పాటించకుండా పనిచేయడం ఒక్కచైతన్యవంతులకే సాధ్యం.

కరువుకాలవ పనిలో ఈ చైతన్యము, ఈ కార్యదీక్ష వన్నెతరుగకుండా ఉంటాయనడానికి సందేహంలేదు. బందరు కాలవలో స్థాపించిన సుసాంప్రదాయాలను ఇంకా ముందుకు తీసుకుపోగలరు. రైతులు ఆతృతతో నీటికోసం ఎదురు చూస్తున్నారు. చల్లగాప్రవహించి, ఆకుమళ్ళను తడపడానికినీరు కూడసిద్ధంగాఉంది. 10 వ తేదీ నాటికి పని ముగించి, కరువుకాల్వలోనీరు వదలాలని కార్యనిర్వహకుల నిర్ణయం. పనిచేస్తున్న దళాలు ఈ నిర్ణయాన్ని కొనసాగిస్తున్నాయి.



ప్రజాశక్తి సంపాదకులు కామ్రేడ్ చంద్రం

[కాలువపనినిగురించి కామ్రేడ్ సుంకర సత్యనారాయణ రాసిన బుర్రకథలో కొన్ని ఘట్టాలు]

రైతుసంఘం పిలుపు:

ప్రజలశక్తియంటె ఏమిటో - సై
బీదోళ్ళశక్తంటే ఏమిటో - సై
చూపేటి యవసరము నేడెరా - సై
చొరవతో ముందునకు రావయ్యా - సై
నీపలుగు శక్తినీ చూపరా - సై
నీపారశక్తినీ చూపరా - సై
నీనేర్పు నీకార్యదీక్షనూ - సై
నేడె చూపెట్టాలి రావయ్యా - సై

పిలుపు అందగానే రైతు, కూలీలు:

నారుపోయుపని మానివేసియొక
వీరవరేణ్యుండు
పారా పలుగు తట్ట బట్టుకొని
ప్రయాణమయ్యాడు
ఇంతకుమించిన పనియేముందని
ఎంతో మోదమున
కొంతబలగమును తీసుక కదలిరి
కూలియువకులంది

తమపని చేయనిదె పోనీమని
తంటాల్ పెడుతున్న
అమిత స్వార్థపరుల ధనికుల మాటల
నాలకించకుండ
....
కన్న కుమారిత జబ్బుగ నుండగ
కదలివచ్చె నొకడు
అన్నానీతో సంబంధానికి యరుదెంచితిమన్న
కాలువ తవ్వకు పోతున్నానది కడతేరినపిదప
బాలిక పెండిలి తలపెట్టుదనని బదులుజవాబిచ్చి
తల్లిలేని తన చిన్నికొమార్తెకు ఇల్లువప్పగించి
బల్లిదుడగు నొకకూలివీరుడు బయలుదేరివచ్చె
• • •
తవ్వరా తవ్వరా కూలన్న
తవ్వి తట్టలకెత్తు రైతన్న
తవ్వినా మట్టంత దరికి జేరబోసి
పంటనెక్కువచేసె ప్రజ్ఞనాదేనంటు॥ త॥
మేటిమేటివాళ్ల మాటకారులంత
నీప్రజ్ఞగని నేడు నిర్విణ్ణులవ్వాలి॥ త॥
నీ చెమటతో కాల్వ నిండి ప్రవహించంగ
తెగపండి ధాన్యాలు తీరాలి కరువంటు॥ త॥
నీరైతు సంఘమే నీకూలి సంఘమే
నడుముగట్టి నేడు పనికిపూనుకుంది॥ త॥

కడియాల గోపాలరావు — సుందరయ్య



వాసుదేవరావు ముక్కామల నాగభూషణం నెత్తికి తట్ట నందిస్తున్నాడు
అవెనుక ఆంధ్రరాష్ట్ర అభ్యుదయ రచయితల కార్యదర్శి చదలవాడ పిచ్చయ్య



నైజాంరాష్ట్రానికి ప్రజామంత్రివర్గం కావాలి

నైజాంరాష్ట్ర ఆంధ్రమహాసభ తీర్మానం

●

(12 వ పేజీ తరువాయి)

ఉపన్యాసాల అనంతరం వివిధ జిల్లాల నుండి వచ్చిన వైజ్ఞానిక దళాల సమిష్టిగానం, సడసపాట, కోలాటం బుర్రకథ మొదలైన ప్రదర్శనల ద్వారా ప్రజల సమస్యలను కళ్ళకుకట్టినట్లుచూపెట్టారు. ఇట్టి కార్యక్రమం యీ ప్రాంతంలో అంతగా ప్రచారంలోలేదు. షుమారు 10 వేల మంది ప్రజాసామాన్యం (వీరిలో 600 స్త్రీలు) ఈ ప్రదర్శనలను తదేకదృష్టితో చూచి, ఆనందించారు. శ్రీ అడివి బాపిరాజుగారు: "ఇట్టి కార్యక్రమం ప్రజలలో సంచలనం కలిగించడానికి చాలా ఉపయోగపడుతుంది; 1921 లో కూడా మేం యిలాగే కాంగ్రెసు సందేశాన్ని ప్రజల్లో ప్రచారం చేసేవారం" అన్నారు. నిల్వవ్యాపారస్తుల అక్రమాలను ప్రజల్లో బట్టబయలు చేయడానికి ఇట్టి కార్యక్రమం చక్కని సాధనం, అని మల్లిక్ అల్లీఖాన్‌గారు పలికారు. అక్బర్ వుఫాఖాన్‌గారు "ఈప్రదర్శనలన్నీ అందంగాను, ఒరిజినల్‌గాను, ఉన్నా" యని అభిప్రాయమిచ్చారు. ఈ దళాలను హైదరాబాద్ ఒకసారి తీసుకెళ్ళాలని సంగం లక్ష్మీబాయమ్మగారు మరునాడు రాజాబహదూర్ వెంకట్రామారెడ్డి గారికి సూచించగా, ఆయన అంగీకరించారు.

కల్చరల్ ప్రదర్శనలతో మొదటిరోజు కార్యక్రమం పూర్తి అయింది.

రెండవరోజు మహాసభ

29 వ తేదీ రాత్రి గం 8 లకు మహాసభ తిరిగి ప్రారంభమయింది. మొదట సందేశాలు చదువబడ్డాయి. ఈక్రిందివారు మహాసభ విజయాన్నికోరుతూ సందేశాలు పంపించారు. "జాతీయపక్షం." కమ్యూనిస్టులు తిరిగి ఐక్యతతోపనిచేయవలసిందనిహెచ్చరిస్తూ జాబులు వ్రాశారు. మహారాష్ట్ర పరిషత్తు అధ్యక్ష కార్యదర్శులు; కర్ణాటక పరిషత్తు వర్కింగ్ కమిటీ సభ్యులైన లక్ష్మణరావుగనూగారు; రాజాబహదర్ వెంకట్రామారెడ్డిగారు; విఠల్ దేశపాండే (ఆంధ్ర - మహారాష్ట్ర - కర్ణాటక పరిషత్తుల జాయింట్ కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యులు); స్టేట్ కాంగ్రెసు నాయకులలో ఒకరైన మేల్కోట్‌గారు; వావిలాల గోపాల కృష్ణయ్యగారు (ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ కార్యవర్గ సభ్యులు)

హైదరాబాద్ స్టేట్ కాంగ్రెసునాయకులైన స్వామీజీ మహాసభకు స్వయంగావచ్చి, ఈ క్రిందివిధంగా తమసందేశాన్ని అందజేశారు. "జాతీయపక్షంవారు యీ మహాసభను బహిష్కరించుట నాకెంతో ఆశ్చర్యాన్ని కలిగించింది. తమ తటస్థవిధానాన్ని విడిచిపెట్టవలసినదిగా నేను వారిని ఒప్పించేటందుకు చాలా ప్రయత్నించాను. కాని నా ప్రయత్నాలు విఫలమైనందుకు బాధపడుతున్నాను. ఆంధ్ర మహాసభలో అన్నిపార్టీలు కలిసి పనిచేయడానికి కావలసినంత వీలుఉంది. ఇరుపక్షాల మధ్య ఐక్యతను సమకూర్చుటకై నేనింకా ప్రయత్నిస్తాను."

స్వామీజీ ఉపన్యాసానంతరం, విషయ నిర్ణయసభలో ప్యాసయిన తీర్మానాలు వరుసగా ఆమోదింపబడ్డాయి. వాటిలో ముఖ్యమైనవి యివి.

నైజాం ఆంధ్రజిల్లాల రైతు లందరిని అధికాహారోత్పత్తికి ప్రోత్సహించుటకుగాను ప్రభుత్వంరైతులపై విధించినపన్నులభారాన్ని తగ్గించాలి. సాగుకులాయకైన భూమినంతటినీ సాగులోకి తీసుకురావాలి. శిధిలావస్థలో నున్న చెరువులను మరమ్మతు చేయించాలి. ఒకటి రెండు సంవత్సరాలలో పూర్తిఅగు ప్రాజెక్టులపై ప్రభుత్వం తన దృష్టిని కేంద్రీకరించి పనిచేయాలి.

— రాష్ట్రిమంతట ప్రభుత్వం విధించిన పన్నురేట్లు అత్యధికంగా ఉండుటవల్ల రైతు సక్రమంగా వ్యవసాయం చేయలేకున్నాడు. కాబట్టి, ప్రభుత్వం వివిధతరహాల భూములపై న్యాయమైన పన్నురేట్లను విధించాలి. (రాష్ట్రిమందలి వివిధతరహాల భూములు, వాటిపై విధింపబడే పన్నురేట్లు, నీటితీరువా మొదలైన సమస్యలు వివరింపబడ్డాయి.)

—జాగీర్‌దారులు చట్టవిరుద్ధంగా తమ రైతులపై అమలుజరుపుతూన్న అక్రమాలను ప్రభుత్వం అరికట్టాలి.

—ధాన్యగ్రహణ శాసనాన్ని అమలుపెట్టుటలో ప్రతిరైతుకు తన కుటుంబ, వ్యవసాయ ఖర్చుల కవసరమైనదిపోను, మిగతా ధాన్యమునే ప్రభుత్వం కొనాలి. విర్భంధ వసూళ్ళను నిలిపివేయాలి. స్థానికాధికారుల లంచగొండితనాన్ని రూపుమాపుటకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలి. తూకం విషయములో రైతుల కన్యాయం జరుగకుండా ప్రజాప్రతినిధులు తనిఖీచేసే అధికారం ఉండాలి. గ్రామ, తాలూకా, జిల్లా, రాష్ట్ర అహారసలహాసంఘాలలో ప్రజా ప్రతినిధులకు ప్రాతినిధ్యం వుండాలి. 1 యకరం మెట్ట వరకు భూమిగలవారికి పూర్తి మినహాయింపు; 1 నుంచి 3 యకరాలవరకు ఉన్న వారివద్ద యకరానికి 1 మణుగు ధాన్యం; 3–5 యకరాలమధ్య గల వారివద్ద యకరానికి 2 మణుగులు; 5–10 యకరాలమధ్య గల వారివద్ద యకరానికి 3 మణుగుల చొప్పున వసూలుచేయాలి. 10 యకరాలకుపైన యకరానికి 4 మణుగులు తీసుకోవాలి. 6 అణాలలోపు పంటకు పూర్తిగాను, 12 అణాలలోపు వంటకు సగం మినహాయింపు వుండాలి.

రాజకీయ తీర్మానంపై ప్రతినిధులలో అభిప్రాయభేదం ఏర్పడింది. నేటి యుద్ధంలో ఫాసిస్టు దుష్టశక్తులకు వ్యతిరేకంగా పోరాడే ప్రపంచ ప్రజాపక్షం గెలవాలనీ; భారతీయుల పూర్తి సహకారం లభించేటందుకు వివిధ ప్రజాపార్టీలకు చెందిన ప్రతినిధులతో జాతీయ ప్రభుత్వాన్ని స్థాపించాలనీ; హైదరాబాద్ స్టేట్‌లో ఆంధ్రమహాసభ, మహారాష్ట్ర పరిషత్తు, కర్ణాటక పరిషత్తు, ఇత్తిహాదుల్ ముసల్మీన్, అనే 4 సంస్థల ప్రజాప్రతినిధులతో గూడిన ప్రజామంత్రివర్గాన్ని నిజాంప్రభుత్వం ఏర్పరచాలనీ—తీర్మానంలోని ముఖ్యాంశాలు.

కొందరు యీ తీర్మానానికొక సవరణను ప్రతిపాదించారు. పై ప్రజాసంస్థలతోబాటు ఆర్యసమాజం, హిందూ ప్రజామండలి, నిమ్నజాతులవారు, క్రైస్తవులు, మొదలైన వారికికూడా ప్రాతినిధ్యం వుండాలని సవరణ. ఈ సవరణ కనుకూలంగా మాట్లాడినవారు ఇత్తిహాదుల్ ముసల్మీన్ ఒక మతసంస్థఅనీ, అట్టి మతసంస్థలకు ప్రాతినిధ్యం ఇవ్వడంలో ఆక్షేపణ లేనప్పుడు యితర మతసంస్థలకు కూడా యివ్వాలనీ, వాదించారు. ఇత్తిహాదుల్ ముసల్మీన్ ముస్లింల ప్రధానరాజకీయసంస్థగా అయివున్న విషయాన్ని వీరు గుర్తించకపోవడంఆశ్చర్యకరం. ఆసంస్థలోని కొందరు అభివృద్ధినిరోధకుల నినాదాలే సామాన్య ముస్లింల నినాదాలని దేశంలో అనేకమంది భ్రమపడుతున్నారు. ఈభ్రమను ఆధారంగా తీసుకొని తమ సవరణను నెగ్గించుకోవాలని వీరు ప్రయత్నించారు. కాని, అత్యధిక సంఖ్యాకులచే అది ఓడిపోయింది. సవరణకు అనుకూలంగా 7 వోట్లుమాత్రం వచ్చాయి.

అనుభవం లేనికొందరు దేశంలో వర్గ వైషమ్యాన్ని రేకెత్తించి, రక్తపాతానికి కారకులౌతున్నారు కాబట్టి, అట్టివారి చర్యలను మహాసభ నిరసించాలని పైభాగం దమే మరొక తీర్మానం తీసుకొచ్చింది. "కమ్యూనిస్టులు" అనే శబ్దం తీర్మానంలో లేకపోయినప్పటికీ, ఎవరిని గురించి అది వుద్దేశింపబడినదో ప్రతినిధులందరికీ తెలుసు. ఎవరెవరు, ఎక్కడెక్కడ, రక్తపాతాన్ని ప్రోత్సహించారో ఒక్క ఉదాహరణ కూడ వీరీయజాలకపోయారు. తీర్మానా కనుకూలంగా 10 వోట్లకంటె ఎక్కువరాలేదు.

తరువాత "జాతీయపక్ష" నాయకులపై విశ్వాసం ప్రకటించి వారి సహకారాన్ని కోరుతూ పైవారే మరొక తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని అంగీకరించడమంటే అర్థం, గతసంవత్సరంలో ఆంధ్రమహాసభను బలహీనపరచడానికి "జాతీయపక్షం" వారవలంబించిన విధానాన్ని సమర్థించడ (మిగతా 9వ పేజీలో)

11 వ ఆంధ్ర మహాసభను గురించి ముస్లిం ప్రముఖుని అభిప్రాయం

— స్వకీయ విలేఖరి

'ఇత్తిహాదుల్ ముసల్మీన్' అను నిజాంరాష్ట్ర ముస్లింప్రజల సంస్థ యొక్క స్థాయిసంఘ సభ్యుడు అక్బర్ వుఫాఖానీ, బి. ఏ. ఎల్. ఎల్. బి. గారిని 29-5-44 వ తేదీని సందర్శించాను. 11 వ ఆంధ్రమహాసభ సమావేశాన్నిగురించి వారి అభిప్రాయం అడుగగా (వీరు రెండురోజులు కార్యక్రమానికి పూర్తిగా హాజరయారు) యిలా చెప్పారు:

"ఆంధ్రమహాసభలో యింతచక్కని నిర్ణయాలు తీసుకుంటారని నేను ఊహించనైనాలేదు. ఇంతవరకు ఆంధ్రమహాసభ, మహారాష్ట్రిపరిషత్తు, కర్ణాటక పరిషత్తు, మందకొడిగా మాత్రమే రాజకీయ పోరాటాన్ని కొనసాగిస్తూ వచ్చాయి. కాని ఇప్పుడు ఆంధ్రమహాసభ దృక్పధంలో చక్కనిమార్పు వచ్చింది. కార్యాచరణలో సత్ఫలితాలను కలిగించే రాజకీయ పోరాటం యిప్పుడు ప్రారంభమయింది. నిజాంరాష్ట్రియొక్క రాజకీయ భవిష్యత్తును నిర్ణయించగల సదవకాశం లభించిందనడానికి యిప్పుడు ఆధారం దొరికింది. మహాసభలో ఆమోదింపబడిన తీర్మానాలన్నీ అభివృద్ధిని సూచించేవిగాఉన్నాయి. పేదలకష్టాలను తీర్చడంలోను, వివిధ వర్గాల, సంస్థలమధ్య ఐక్యతను తీసుకురావడంలోను, పాటుపడాలనే తృష్ణ నాకు బాగా కనబడింది. అట్టి ఐక్యతను సాధించబడిననాడే, నిజమైన అభివృద్ధికి వాతావరణం ఏర్పడుతుంది.

"వైజ్ఞానిక ప్రదర్శనాలు నన్నెంతో ఆకర్షించాయి. ప్రజాసామాన్యంలో చైతన్యం కలిగించడానికి యివి చక్కనిసాధనాలు. రైతుల్ని, క్రిందితరగతులకు చెందిన బీద ప్రజల్ని, కర్తవ్యోన్ముఖులుగా చేయడానికి ఈ ప్రదర్శనాలెంతైనా ఉపయోగపడతాయి.

"మొత్తంమీద, యువకకమ్యూనిస్టు, కామ్రేడ్ నారాయణరెడ్డి నాయకత్వాన యీ మహాసభ అన్నివిధాల విజయవంతంగా కొనసాగింది."

గాంధీజీ విడుదలనుగురించి మీ అభిప్రాయమేమని ప్రశ్నించాను. వారు యీ క్రిందివిధంగా జవాబిచ్చారు: "గాంధీజీ విడుదలవల్ల ఆహారసమస్యా పరిష్కారానికి మంచి అవకాశం లభించింది. కాని, ఆయన ఒక్కడూ ఏమిచేయగలడు? ఇతర కాంగ్రెసు నాయకుల్నికూడా విడుదలచేస్తేగాని, ఏసమస్య జయప్రదంగా పరిష్కరింపబడజాలదు. ప్రజాభిప్రాయం ఇంకా బలీయమై, ప్రభుత్వం మీద ఒత్తిడి ఎక్కువయిననాడు, యితర కాంగ్రెసునాయకుల్నికూడా విడుదలచేయవలసి వస్తుంది. ప్రభుత్వం పరిస్థితుల తీవ్రతను గుర్తించవలసి వస్తుంది."

★ రైతు సమస్యలు

ఆత్మకూరు తాలూకాలో ఇనుపవర్తకుల దగా

నెల్లూరుజిల్లా ఆత్మకూరు తాలూకాలో ఇనుపవ్యాపారస్తుల దగాను గురించి జి. సి. కొండయ్యగారు ఇలా తెలియజేస్తున్నారు.

గత సంవత్సరం, ఆత్మకూరుతాలూకా రైతులు ఇనుపసిముట్లకొరకు ఆందోళన చేయసాగారు. ప్రభుత్వానికి తీర్మానాలు, మెమొరాండములు పంపారు. దాని ఫలితంగా తాలూకాకు 3 టన్నుల ఇనుము ఇవ్వడానికి అధికారులు తయారయ్యారు. కాని 145 గ్రామాలున్న తాలూకాకు 3 టన్నులఇనుము చాలదని ఆందోళనచేశారు. 20 గ్రామాలలో ఇండ్లవారీగా ఇనుపలెక్కలను తయారుచేసి, వ్యవసాయడిమాన్‌స్ట్రేటర్ వద్దకు, కలక్టరు వద్దకు రాయబారంవెళ్ళారు.

దీనిఫలితంగా, తాలూకాలో ఇనువలైసెన్సుదారుడైన పరిటాల వెంకటసుబ్బయ్య గారికి కంట్రోలురేటుకు ఇనుము అమ్మమని ఇనుమును సప్లయిచేసింది ప్రభుత్వం. కాని ఈ ఇనుమును దొంగతనంగా అమ్ముకొనడం చేత రైతులకు దక్కలేదు. రెండవ దఫా మే మొదటివారంలో తిరిగి ఇనుమువచ్చింది. 5 టన్నుల ఇనుమును కంట్రోలు ధరకు రైతుల కివ్వవలసిందని, అధికారులు తెలియజేశారు.

వ్యవసాయ శాఖవారు యినుం కొరకు రైతులుపెట్టిన దరఖాస్తులపైన సర్టిఫికెట్లు వ్రాసి పంపారు. ఇవి తీసుకొని రైతులు 18, 19, 20 తేదీలలో పై వ్యాపారస్తునివద్దకు వచ్చారు. కాని అతడు యినుము ఈయ నిరాకరించాడు. పోనీ, అమ్మేధరలకు రశీదివ్వమన్నా, యివ్వనని నిరాకరించాడు. యినుమును రహస్యంగా దాటవేసి, అమ్మివేయాలని ప్రయత్నించాడు. అందుచే రైతుసంఘ వలంటీర్లు అతని యింటికి కాపలా వేశారు. యిదంతా చూచి "22 వ తేదీన ఇస్తాను రమ్మని" రైతులను పంపివేశాడు. కాని 22 వ తేదీన వచ్చినా, కొట్టు తలుపులు మూసి, యివ్వను పొమ్మన్నాడు.

23వ తేదీనఇతడు, వాశిలి గ్రామమునసబుగారి తమ్మునకు 24 పారలు అమ్మాడు. చట్టప్రకారం 6 పారలకన్నా ఎవరికీ యివ్వగూడదు. రైతువర్కర్లు బస్సులో వెళ్ళిపోతున్న ఆ ఆసామిని పోలీసుస్టేషనుకు ఎదురుగా పట్టుకొని, పోలీసువారికి అప్పచెప్పారు. కాని పోలీసులు అతనిపై ఎట్టి చర్యను తీసికోలేదు.

ఇది విన్న వ్యాపారస్తుడు, మునసబు తమ్మునిచేత రైతు వర్కర్లపై కేసు పెట్టడానికి ప్రోత్సహించాడు. బస్సులో పారలు, సువ్వలూ (సువ్వలు అసలు అతను తీసుకుని వెళ్ళనేలేదు) తీసుకుని వెళుతున్న తనదగ్గర నుండి రైతువర్కర్లు, వాటిని దొంగిలించారట! బస్సులో అనేకమంది ప్యాసెంజర్ల మధ్య కూర్చున్న పెద్దమనిషిని, పోలీసుస్టేషనుకు ఎదురుగా రైతుసేవకులు దోచుకున్నారంటే నమ్మే బుద్ధిహీనుడెవడు?

23 వ తేదీ రాత్రి ఆత్మకూరులో జి. సి. కొండయ్యగారి అధ్వర్యాన జరిగిన సభలో, దొంగవ్యాపారులు చేసే దగాను వివరించి, అలాంటివి జరగకుండా ఉండటానికి ప్రజలంతా ఐక్యం గావాలని ఉపన్యాసకులు ప్రబోధించారు.

పనులు మానుకొని, ఎర్రటి ఎండలో ఇనుముకొరకు మైళ్ళకొలది రావలసివచ్చినా, రైతులు మానలేదు. పట్టుదలతో తిరిగి 24వ తేదీ 10 గంటల కల్లా రైతులు గుంపులు గుంపులుగా ఇనుపఅంగడికి వచ్చారు. వర్తకుడు లొంగిపోక తప్పిందికాదు. అరవీశపారలు రు 2 లకు కూడా అధికధరలకు అమ్మిన వర్తకుడు వీశె రు. 1-7-6 చొప్పున ఇప్పుడు అమ్మవలసివచ్చింది.

కాని యింతటితోనే పని పూర్తికాలేదు. ఈ వ్యాపారస్తులు పెట్టే చిక్కులు అనేకం ఉంటాయి. వీటినన్నిటినీ ఎదుర్కోవాలంటే రైతులు ఐక్యంగా ఉండాలి. అధికారులు గూడా, కంట్రోలుధరకుమించి అమ్మేవర్తకులపై తీవ్రంగా చర్యతీసుకోవాలి.

★

ఇనుప వ్యాపారస్తుల దొంగ వ్యాపారం

వ్యవసాయ డిపార్టుమెంటు ఇనుమును తెప్పించి, రైతుల వ్యవసాయ పనిముట్లకు ఇబ్బంది లేకుండా చేయాలని ప్రయత్నించుతోంటే, దొంగ వ్యాపారస్తులు రైతులకవి అందకుండా జేస్తున్నారు. రైతులు కంట్రోలు రేటుకంటే ఎక్కువపెట్టి కొనుక్కోవలసి వస్తోంది.

కావలిలో చలవాది కొండయ్య అనే వ్యాపారస్తునివద్ద, గట్టుపల్లి గ్రామరైతు అంకయ్య అనేఆయన ఒకచలకపారకొంటే దానిని కంట్రోలుధరకు మించి 1-14-0 కు అమ్మాడు. స్థానిక ప్రజాసేవాసంఘం వారీ విషయం తెలుసుకొని, బిల్లు తీసుకురండని వర్తకునివద్దకు ఆరైతును పంపారు. బిల్లు ఇవ్వకుండా వర్తకుడు పారమీద సీమసున్నంతో "$\frac{3}{4}$ శేరు రు 1-4-0" అని వ్రాసి పంపాడు. ఈవిషయమై సేల్సుటాక్సు ఆఫీసరుకు తెలిజేసినా, చర్యతీసుకోలేదు. ఇలాంటి అక్రమాలను వెంటనే అధికారులు అరికట్టాలి.

★

చెరువుల మరమ్మతును రైతులుత్సాహంగా చేస్తున్నారు

అనకాపల్లి తాలూకా దాపయ్యపాలెం. ఈ సంవత్సరం కరువుకు గురిఅయింది. ప్రభుత్వం 100 కి 8 బస్తాల చొప్పున బియ్యం కోటా యిచ్చింది. తాము, ఇతర గ్రామాల ప్రజలు ఈ సంవత్సరం అనుభవించిన కరువుబాధను గుర్తించుకొని, చెరువులను బాగుచేసుకొని అధికంగా పంట పండించడానికి కృతనిశ్చయులయ్యారు.

తాలూకా రైతుసంఘ యాజమాన్యాన ఎస్టేటు అధికార్లవద్దకు రాయబారం వెళ్ళి రు 2000 శాంక్షన్ చేయించుకొన్నారు. స్థానికాధికారులు, చెరువులుమరమ్మతుచేసే కూలీలకు బియ్యం సప్లయిచేయడానికి అవకాశం లేదన్నారు. అయినా ఈ కష్టాన్ని గుర్తించకుండానే, తమకువచ్చే కొద్దిగింజలలోనే సర్దుకున్నారు. రైతులు - కూలీలు ఉత్సాహంగా పాటలు పాడుకుంటూ పని ప్రారంభించారు. ఈ గ్రామ రైతుల కృషి, తదితర గ్రామ రైతులనుకూడ ఉత్సాహపరిచింది. వారు కూడా తమతమ చెరువులను మరమ్మతు చేయడానికి ఉద్యుక్తులవుతున్నారు.

★

అచ్చువేసిన అప్పుఫారాలు

ప్రభుత్వం వ్యవసాయాభివృద్ధికిగాను ఇచ్చే అప్పులకై దరఖాస్తులను అచ్చుఫారాల మీదనేగాక, విడిగా తెల్లకాగితాలపైనకూడా పెట్టుకోవచ్చు. కాని ఇలా తెల్లకాగితాలమీద వ్రాసేటప్పుడు ఒక పద్ధతిని వ్రాయకపోవడం తటస్థించవచ్చునని, బాపట్ల తాలూకా రైతుసంఘం అప్పుఫారాలను అచ్చువేయించింది. తాలూకా రైతులు రైతుసంఘ ఆఫీసులలో అచ్చుఫారాలను తీసుకు వెళ్ళవచ్చును - అని బాపట్ల తాలూకా రైతుసంఘ కార్యదర్శి జి. సిద్ధయ్యగారు వ్రాయుచున్నారు.

(8వ పేజీ తరువాయి)మన్నమాట. ఈతీర్మానానికి కూడా పదిపన్నెండు వోట్లుమాత్రమే అనుకూలంగా వచ్చాయి. తరువాత ఆంధ్ర మహాసభ పాలసీపైతీర్మానంచర్చకువచ్చింది. ఆంధ్రమహాసభలో అన్నిదృక్పధాలకు స్థానం వున్నదనీ; అందరూకలిసి పనిచేయడంవల్లనే ప్రజలకు చక్కగా సేవచేయగలమనీ; కాబట్టి దేశంయొక్క క్షేమాన్ని దృష్టియందుంచుకొని అన్నిపార్టీలవారు యిందులో అధికార - అనధికార సంబంధము లుంచుకోవలసిందని తీర్మానం కోరింది. ఇందులో ఆక్షేపణీయమైనవిషయంఒక్కటీలేదు. అయినా "జాతీయపక్ష" నాయకులపట్ల విశ్వాసం ప్రకటించి వారి సహకారాన్ని కోరిన వ్యక్తులే యీ తీర్మానాన్ని వ్యతిరేకించడం శోచనీయమైన విషయం. ఈసారికూడా వీరికివోట్లు బహుతక్కువ మాత్రమే వచ్చాయి. తీర్మానం అత్యధిక సంఖ్యాకులచే ఆమోదించబడింది.

ముగింపు

11 వ నిజాంరాష్ట్రి ఆంధ్రమహాసభ అనేక విషయాలలో ప్రాధాన్యత వహించింది.

ఇంత ప్రజాసమీకరణ మునుపెన్నడూ జరిగియుండలేదు. ప్రజల జీవితసమస్యలు తీసుకొని పనిచేయడంవల్లనే ఆంధ్రమహాసభ యింతబలీయమైన ప్రజాసంస్థగా వృద్ధి చెందింది. కరువు పరిస్థితుల్లో జనబాహుళ్యం విశేషంగా వచ్చి కాన్ఫరెన్సును విజయవంతంగా నిర్వహించుటలో తీర్పరజాలరనే వాదన ఆధార రహితమైనదని రుజువైంది.

మహాసభ అధికాహారోత్పత్తి, జాగీర్ రైతుల సమస్యలు, ఆహారసేకరణ శాసనం, పన్నుల విధానం, మొదలైన సమస్యలపై ప్రజాసామాన్యానికి స్పష్టమైన మార్గం చూపింది. ఈ కార్యక్రమంపై అన్నిపార్టీలవారు కలిసి పనిచేయడానికి అవకాశం కలిగింది.

ఇత్తిహాదుల్ ముసల్మీన్‌ను ముస్లిం ప్రజల రాజకీయ సంస్థగా గుర్తించి, ప్రజామంత్రివర్గంలో దానికికూడా స్థానం ఉండాలని తీర్మానించటంవల్ల, ముస్లిం ప్రజలలో గల అనుమానాన్ని చాలావరకు తీర్చింది. ఈ తీర్మానాన్ని అన్ని జిల్లాలలో ప్రచారం చేసి, ముస్లిం ప్రజలపట్లగల అపోహలను తొలగించిన నాడు సంపూర్ణమైన జాతీయైక్యతకు మార్గం ఏర్పడుతుంది. దాదాపు నాలుగు వందల మంది ముస్లింలు మహాసభకు హాజరై యీతీర్మానంచర్చింపబడుతూన్నప్పుడుతదేకదృష్టితో విన్నారు. ఇంతేకాదు, ఇత్తిహాదుల్ ముసల్మీన్‌నాయకులు ఆంధ్రమహాసభ వేదికయెక్కి, ఉపన్యసించడానికి యిదే మొదటిపర్యాయం.

ఆంధ్రమహాసభలో "జాతీయపక్షానికి" చెందినవారు యీ కాన్ఫరెన్సుకు రాకపోవడం విచారించవలసినవిషయమనీ, కమ్యూనిస్టులు-"జాతీయపక్షం" వారు తిరిగి కలిసిపనిచేయడానికి మార్గం ఆలోచించాలనీ, అనేకమంది సందేశాలు పంపించారు. దీన్నిబట్టి ఐక్యతయొక్క అవసరం ఎంతవుందో బోధపడుతోంది. ఆంధ్రమహాసభ పాలసీని గురించి ఆమోదింపబడిన తీర్మానం అట్టిఐక్యతకు అవకాశం యిచ్చింది. అన్నిదృక్పధాలవారు ప్రజలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించుటకై ఆంధ్రమహాసభలో కలిసి పనిచేయవచ్చునని చూపింది. 80 లక్షలమంది నిజాం ఆంధ్రులు అట్టి ఐక్యతకై ఎదురుచూస్తున్నారు.

త్వరలో వస్తున్నాయి

నేటి సోవియట్ యూనియన్

250 పేజీలు : వెల 3—0—0

ఇందులో సోవియట్ యూనియన్ ఆర్థిక-రాజకీయ- సామాజిక విధానాన్ని గురించి వివరింపబడింది. మనదేశానికి వళ్ళమోత్తర సరిహద్దునవున్న కజాక్, కిర్గీజ్, టర్కోమాన్, మొదలైన రిపబ్లిక్కులు మధ్యయుగాల ఫ్యూడల్ విధానంనుండి ఒక్కసారిగా సోషలిస్టు విధానంలో యెలాంటి అభివృద్ధిని పొందగలిగాయో చూపబడింది. 200 సంవత్సరాలు శృంగి కృశించుతున్న మనదేశానికి 25సంవత్సరాలలోసోవియట్ ప్రజలు పొందిన అభివృద్ధి మార్గదర్శకం అని చెప్పవచ్చు. ఎంత ఈ అభివృద్ధిఅంతా పుస్తకంలో స్పష్టీకరించబడింది.

అందమైన చిత్రాలు, వివరాలతో ఛార్టులు, దీని ప్రత్యేకలక్షణాలు.

సోవియట్ విదేశాంగనీతి : భారతదేశం

80 పేజీలు : వెల 0-10-0

సోవియట్ యూనియన్ ఇండియాకు ఏమిచేసింది? ఫాసిస్టు జపానుతో సోవియటు ఎందుకు ఒడంబడిక చేసుకొంది? అట్లాంటిక్ ఛార్టర్‌లో స్టాలిన్ ఎందుకు సంతకంచేశాడు? సోవియట్ విజయాలవల్ల సామ్రాజ్యవాదులు బలపడుతున్నారా, బలహీనపడుతున్నారా? మొదలైన ప్రశ్నలకు యీ పుస్తకంలో చక్కని జవాబులు లభిస్తాయి. సామ్రాజ్య విస్తరణకు సోవియట్ బద్ధశత్రువనే విషయం రుజువు చేయబడింది.

ప్రజాశక్తికార్యాలయం, బెజవాడ

★ యుద్ధ సమీక్ష

రోంనగరంలో మిత్రసేనల ప్రవేశం

— తుమ్మల వెంకటరామయ్య

రోమ్‌కు దక్షిణాన ముఖ్యకేంద్రాలగు వెల్రిట్రీ - వాట్‌మోంటోన్‌లు మిత్రసైన్యాల వశమయ్యాయి. వీటితో రోమ్‌నగరానికి కడపటి రక్షణశ్రేణి బ్రద్దలయిందనవచ్చు. అల్బన్ పర్వతరక్షణశ్రేణిని ఛేదించుకొనిపోయిన పంచమసైన్యం రోమ్‌నగరంలో ప్రవేశించింది. రోమ్‌నగర ఆక్రమణ ఇంకా పూర్తికాలేదు. జర్మన్లు నామమాత్రంగా ప్రతిఘటించుతున్నారు.

రోమ్ ఆక్రమణతో, ఒక్క మిలటరీ పరిస్థితులలోనేగాక, ఇటలీ రాజకీయ వాతావరణంలోకూడ మార్పువస్తుంది. ఇటలీ ప్రజాస్వామ్యపక్షాలకు బలం చిక్కుతుంది.

ఇటలీలో మిత్రసైన్యాల విజయంతోపాటు, ఉత్తరభాగంలో జర్మను ప్రతికూల ఉద్యమం తీవ్రమయింది. ఉత్తర ఇటలీలో 30 లక్షల కార్మికు లప్పుడప్పుడు సమ్మె చేస్తున్నారు; గెరిల్లాలకు తోడ్పడుతున్నారు. ఇటలీ వాయువ్యభాగంలోని ఇటాలియన్ దేశభక్తులు ఫ్రెంచి గెరిల్లాలతో సంబంధం పెట్టుకొన్నారు. ఇటలీనుండి ఫ్రాన్సుకు ముఖ్య రహదారియగు శాన్‌బెర్నార్డోను తమ చేతులలో పెట్టుకున్నారు.

ఉత్తర ఇటలీలో జాతీయ ప్రతిఘటనా కమిటీ ఇలా ఉత్తరువు చేసింది:

"జర్మన్లపై ఒక్కసారి అంతా తిరుగుబడే సమయం ఆసన్నమయింది. మన తీరాన మిత్రసైన్యాలు గనుక దిగినట్లయితే, వెంటనే మిత్ర సైనికుల ఆధిపత్యంలోకి మనంపోయి సహాయపడాలి."

దీనికితోడు మరొకవార్త లండన్ నుండి వచ్చింది. ఇటలీ సైన్యాధికారులూ, యుద్ధశాఖ సహాయ కార్యదర్శి సీనర్ పాలెర్మో (ఇతడు కమ్యూనిస్టు. సామ్రాజ్య వాదుల ధోరణిలో సైన్యాలను పునర్నిర్మించాలనే పద్ధతికి పూర్తి వ్యతిరేకి), ఇటలీ సైన్యాలను తమ మాతృదేశ విమోచన యుద్ధంలో పాల్గొననీయాలని కోరుతున్నారని ఆవార్త. ఇటాలియన్ ప్రజల సహకారం హెచ్చినకొలదీ, ఇటలీలో జర్మన్ సేనల అపజయం మరింత త్వరితంగా పూర్తి అవుతుంది; ఇటలీ విముక్తి త్వరితమవుతుంది.

అస్సాం - బర్మా రంగంలో

అస్సాం - బర్మా రంగంలో వర్షాలు ప్రారంభించడం తప్ప, చెప్పదగ్గ తీవ్రమైన మార్పులేవీ లేవు. వర్షాలువస్తే జపాను రాకపోక సౌకర్యాలు భగ్నమవుతాయి; వచ్చే 2 లేక 3 మాసాల్లో జపాను సైన్యాలు మిత్రరాజ్య సైన్యాల చేతుల్లో విపరీతంగా నష్టపడడానికి అవకాశం వుంది - అంటూ మన సైనికాధికారులు ప్రకటనలు చేస్తున్నారు.

కాని పరిస్థితులిందుకు భిన్నంగాఉన్నాయి. జపాను ఏయే కేంద్రాలనుండి మనపై దెబ్బ తీస్తున్నదో, ఆకేంద్రాలనుండి రాకపోకలు బాగానే ఉన్నాయి. వర్షాలకు ఆగగలవుకూడా. ఉదాహరణకు టామూ, టిడ్డింలనుండి ఇంఫాల్‌కు పోయే రోడ్లు వర్షాల కాగగలవు. ఇంతేగాక చింద్విన్‌లోని జపాను స్థావరాలనుండి ఉఖ్రుల్‌కు, కొహిమాకు కూడా మోటారు రోడ్లున్నాయి. కాబట్టి వర్షాల వల్ల జపాను ప్రయత్నాలు ఆగవు. పోతే జపాను ఆత్మరక్షణ చేసికొనేచోట, మిత్రరాజ్య సేనల పురోగమనానికి, వర్షాలు ప్రతిబంధకంగా ఉన్నాయి. మన సైన్యాలకు రాకపోక సౌకర్యాలు లేకుండా ఉన్నాయి.

ఉదాసీనతవల్ల లాభంలేదు

ఈ పరిస్థితులనుకప్పిపుచ్చి,ప్రజలలో ఉదాసీనభావాన్ని, ఫర్వాలేదులే అన్న ఆత్మసంతృప్తిని సైనిక ప్రకటనలు కలుగజేయడంవల్ల, వచ్చేలాభం సున్న. పైగా అష్టకష్టాలమధ్య విజయాలుగాంచే మిత్రరాజ్యసైనికుల వీరోచితపాత్రను కూడా తగ్గించడమౌతుంది.

ఈ వారం యుద్ధగమనం చూద్దాం.

ఇంతవరకు దిమాపూర్ - ఇంఫాల్ రోడ్డులో శత్రుశేషం లేకండా తుడిచిపెట్టలేదు. కొహిమాచుట్టూ, శత్రువులు అప్పుడప్పుడు దెబ్బగొడుతూనే ఉన్నారు. కొహిమాకు ఉత్తరాన నాగా గ్రామంలో శత్రువులింకా ఉన్నారు. ఈ ప్రాంతంలో శత్రువు 25 వ తేదీన దాడిచేశాడు. కొహిమాకు ఉత్తరాన టాంకులుపయోగించి యుద్ధం చేయవలసి వచ్చింది. అంటే ఇక్కడి శత్రువులు లెక్కలోనివారు కాదని ఉపేక్షించకూడదన్నమాట. కొహిమాకు దక్షిణంగా అరదురాశిఖరంనుండి జపాను సైనికులనుతుడిచివేసే ప్రయత్నం పూర్తికాలేదు. వర్షాలు అందుకు ప్రతిబంధకమయ్యాయని మన సైనిక ప్రకటన తెలియజేస్తోంది. కొహిమా ప్రాంతంలో, జపానుసైన్యాలు తిష్ఠవేసికొని ఆత్మరక్షణకు సన్నద్ధమవుతున్నాయని ఒక వార్త. ఒకవేళ నాగా గ్రామాన్ని, అరదురాశిఖరాన్ని మన సైన్యాలు వశపరచుకొన్నా, ఇంకొక ప్రతిబంధకంవుంది. కొహిమాకు 18 మైళ్ళ దక్షిణంలో మావ్‌సాంగ్‌శాంగ్ అనేచోట, ఇంఫాల్ రోడ్డుమీద, శత్రువు దిట్టంగా కాచుకొనిఉన్నాడు. ఈ స్థావరంనుండి కూడా శత్రువును తరిమితే తప్ప, దిమాపూర్ - ఇంఫాల్‌లమధ్య నిరాఘాటమైన రహదారి ఏర్పడదు. ఆగ్నేయ ఆసియారంగ సైనిక ప్రకటన "జపాను సైన్యాలు, కొహిమానుండి దక్షిణానికి మనము గావించేదాడిని తీవ్రంగా ప్రతిఘటించ నిశ్చయించుకొన్నా"యని చెప్పింది. పైగా వర్షాల వల్ల ఇప్పటి మనదాడి ఆగినట్లు చెప్పింది. దానిఅర్థం, దిమాపూర్-ఇంఫాల్ రాకపోకలను కలిపే ప్రయత్నం లేదన్నమాట. అలా రాకపోకలు ఏర్పడనంతకాలం, ఇంఫాల్ ఇంకా చుట్టుముట్టడింపబడిన నగరంక్రిందనే లెఖ్క. ఇంఫాల్‌కు విమానాలమీద సప్లయిలు తీసుకురావలసి వస్తుందికూడా. వర్షాలు అధికమైనకొద్దీ, విమానప్రయాణం కష్టమై ఇంఫాల్‌లోని మన సైన్యాలకు సరఫరా ఇబ్బంది హెచ్చుతుంది.

ఇంఫాల్ పరిస్థితి

ఇంఫాల్‌పైకి, యథారీతిగానే బిషెన్‌పూర్, పాలెల్ ప్రదేశాలనుండి జపాను దాడులు సాగించింది. కాని ఈ దాడులు ఫలించలేదు. ఇంఫాల్‌కు దక్షిణాన 10 మైళ్ళలోకి చొచ్చుకువచ్చి, రోడ్డుపై అవరోధన నేర్పరిచిన జపాను సైన్యాలను మనవాళ్ళు తుడిచిపెట్టారు. బిషెన్‌పూరుకు వాయువ్యంగా ఉన్న వీనాన్ అనే గ్రామంకూడా తిరిగి మనవాళ్ళ చేజిక్కింది. ఇంఫాల్‌కు నైరుతిగా 33 మైళ్లలో టామూ రోడ్డుమీదనున్న సైన్యాలతో, బిషెన్‌పూర్‌నుండి మనసైన్యాలు కొన్ని వచ్చికలిశాయి. ఇంఫాల్ మైదానంలోకి రావాలని పదేపదే ప్రయత్నించిన శత్రుప్రయత్నంగూడా విఫలమయింది. ఇందుచే ఇంఫాల్ పరిస్థితులలో మార్పేమీ రాలేదు.

అసోసియేటెడ్‌ప్రెస్ ప్రత్యేక యుద్ధ విలేఖరి, రేమాండ్‌ఓకెల్లా జపాను ఉద్దేశాలను గురించి 31 వ తేదీన ఇలా వ్రాశాడు: "టామూ రోడ్డు పైన, ఇంతవరకు తాము జయించిన స్థలాలను నిలబెట్టుకొని, తర్వాత ఇంఫాల్‌పైదాడి చేయడానికి నిశ్చయించుకొన్నట్లు తెలుస్తుంది."

హిందూ పత్రిక యుద్ధ విలేఖరి టి. జి. నారాయణ్ కూడ, జూన్ రెండవ తేదీన వ్రాస్తూ, ఇలా అన్నాడు: "వర్షాలు రావడంవల్ల, ఇంఫాల్‌ను పట్టుకోవాలనే తమ ఆశయం భగ్నమవుతుందని జపానువాళ్లు తలచడంలేదు. మాటిమాటికి బిషెన్‌పూర్‌పై దెబ్బతీయడం, వీలైతే బిషెన్‌పూర్‌ను ఒంటరిగా చేయాలనే ప్రయత్నం, టామూ - పాలెల్ రోడ్డుమీద అనువైన స్థానాలనుండి మనసైన్యాలను తొలగించాలనేప్రయత్నమూ, జపానుసేనలు మానలేదు." ఇతడే మరల 3 వ తేదీన వ్రాస్తూ, "కొహిమాకు దక్షిణాన ఉన్న జపాను సేనలు మంచిరకపు సాధనసంపత్తి కల్గివున్నాయి; వర్షాకాలాన్ని భరించగలదుస్తులు పరికరాలు కూడా వాళ్ళకి ఉన్నాయి," అన్నాడు.

కాబట్టి కొహిమా ప్రాంతంలోగాని, ఇంఫాల్ ప్రాంతంలోగాని, వర్షాలవల్లజపాను తన ప్రయత్నాలను విరమించుతుందనుకోడం పొరబాటు.

మిచీనాలో సగభాగం మన సైన్యాల వశమయినా, మిచినా అంతా అప్పుడే మన వశమౌతుందనడానికి వీల్లేదు. ఉత్తర పశ్చిమ దక్షిణ దిశలనుండి మనసైన్యాలు క్రమ్ముకొని వస్తున్నాయి. కాని మిచీనాకు దక్షిణాన ఉన్న రైలుస్టేషనింకా వశంకాలేదు.

మిచీనాకు పశ్చిమాన మొగాంగ్‌లోయలో కామయింగ్‌ను జనరల్ స్టిల్‌వెల్ సైన్యాలు సమీపించుతున్నాయి. కామయింగ్‌కు 5 మైళ్ళలోకి వచ్చాయి. కామయింగ్ - మొగాంగ్‌లమధ్య రోడ్డును కూడా తెగగొట్టాయి.

చిండిట్ సేనలకు దెబ్బ

కాని చిండిట్ సైన్యాలొక కొద్ది అపజయాన్ని పొందాయి. మొగాంగ్‌కు నైరుతిగా చిండిట్ సైన్యాలు నిర్మించిన రైలు - రోడ్డు బ్లాకును జపాను సైన్యాలను తొలగించాయి. 18 రోజుల వరకు నిలచిన ఈస్థావరం, వాతావరణం సరిగాలేక, విమాన సహాయం, ఆహార ఆయుధ సహాయంలేక, పడిపోయింది.

దీనివల్ల జపాను మాండలేనుండి మిచీనాకు, మొగాంగ్‌కు సప్లయిలు తెచ్చుకోడానికి వీలుపడుతుంది. మిచీనా రైలుమార్గం తెగగొట్టి, మిచీనాను పట్టుకోడానికిగాను పైస్థావరాన్ని ఏర్పరచాయి చిండిట్‌సైన్యాలు. కాని మిచీనా ఇంకా వశంకాలేదు. స్థావరం కూడా పోయింది. ఇది మన సైన్యాలకు తీరని నష్టం, జపానుకు లాభం.

చిండిట్ సైన్యాలు ఐరావతి నదినిదాటి, మిచీనాలోని సైన్యాలతో సంబంధం ఏర్పరచుకొన్నాయనిఆఖరివార్తలు.

ఇక ఆరకాన్‌రంగంలో, చిటగాంగ్ బర్మా రోడ్డుకు 3 మైళ్ళలోనున్న లబావాకు జపాను దళం ఒకటి చేరింది. చిటగాంగ్ - బర్మా సరిహద్దులో, చిటగాంగ్‌వైపు హద్దును ఈ దళం చేరలేదు. కాని అప్పుడప్పుడూ గస్తీ దళాలను పంపుతోంది. ఆవిధంగా, బెంగాలులో రెండవసారి కరువుకు గురియైన చిటగాంగ్‌జిల్లాలో శత్రుసైనికులు రహస్యంగా చొచ్చుకురాగల పరిస్థితు లేర్పడ్డాయి.

మొత్తంమీద అస్సాం - బర్మా రంగ యుద్ధంలో, ఇరుపక్షాలు ఒకరి కీలకస్థానాలను ఒకరు వశం చేసుకోవాలని ప్రయత్నించుతున్నాయి. జపాను, ఇంఫాల్‌ను పట్టుకొని మిచీనా మిత్రసేనల వశం కాకుండా చేయాలని చూస్తోంది. మిత్రసేనలు మిచీనాలో ప్రవేశించి, జపాను సైన్యాలు ఇంఫాల్‌లో ప్రవేశించకముందే వాటిని నాశనం చేయాలని ప్రయత్నించుతున్నాయి. ఈ ఆశయసిద్ధికై ఇరుపక్షాలు నిరాశపడక తీవ్రంగా యుద్ధం చేస్తున్నాయి.

చైనాలో ప్రమాదపరిస్థితి

అస్సాం బర్మారంగంలో యుద్ధపరిస్థితి ఇలావుంది. బర్మారోడ్డును తిరిగి వశపరచుకొనేప్రయత్నం ఇంకా ఫలించలేదు.

పైగా చైనాలో పరిస్థితులు మరీ విషమించాయి. హూనాన్‌రాష్ట్ర రాజధానియగు చాంగ్‌షా మీదికి జపాను లక్షన్నర సైన్యంతో పెద్దపెట్టున యుద్ధానికి తలపడింది. కాంటన్ - హాంకో రైల్వేనంతా వశపరచుకోడమేగాక, ఆగ్నేయచైనాలోని మిత్రరాజ్యా లుపయోగించే విమానాశ్రయాలను పట్టుకోడం జపాను ఆశయం. ఇంతేగాక మధ్య, తూర్పు, దక్షిణచైనాలలో కూడ ఒక్కసారిగా జపాను దెబ్బతీయదలచినట్లు ఒక వార్త. అట్టిసమయంలో చైనాకు సత్వరసహాయం చేయాలంటే, భారతప్రజల సహకారంతో జపానును ఓడించి బర్మా - చైనా రాకపోకల నేర్పరచాలి. అంతేగాని భారతప్రజల సహకారంలేకండా, వుత్త సైనికబలంమీద ఆధారపడితే, అస్సాం - బర్మాయుద్ధరంగం ఇంతలోనే తేలడం కష్టం. బర్మావిముక్తి ఒక్కొక్కరోజు వెనకబడిపోతుంది. చైనాకష్టాలు గూడ ఒక్కొక్కమెట్టుగా ఎక్కువ అవుతున్నాయి.

5—7—44

మనరాజకీయాలు

జపాను బారినుండి బయటపడ్డ కాంగ్రెసు ప్రముఖుని అనుభవాలు

శ్రీ హంద్రాజ్ ఎం. వర్వానీ సింధు రాష్ట్ర ప్రముఖ కాంగ్రెసువాదులలో ఒకరు. వీరు జపాను ఆక్రమితదేశాలలో కొంతకాలంవుండి, హాంకాంగ్, బ్యాంకాక్ పట్టణాలలో అనేక సాహసచర్యలొనరించి యీమధ్యనే ఇండియాకు తప్పించుకొచ్చారు. ఈక్రింది ప్రకటనలో వీరు తమ అభిప్రాయాలను తెలియజేస్తున్నారు:

"శత్రువు మన పవిత్ర భూమిపై కాలు పెట్టినప్పటికీ, ప్రజాసామాన్యాన్ని ఎవరూ ఉత్తేజపరచకుండా చూచోవడం ఆశ్చర్యంగా వుంది. ఇది మన మాతృదేశంకానట్టూ, బ్రిటిష్ దేశం ఆయినట్టూ, భావించుతున్నారా? అనిపిస్తోంది. ఇట్టి పరిస్థితికి ప్రధానకారణం బ్రిటిష్‌ప్రభుత్వ విధానంతప్ప మరొకటికాదనే విషయం మనమందరం ఎరుగుదుము. అయినప్పటికీ, దేశాభ్యుదయం — ప్రజలశ్రేయస్సు అన్నింటికంటె మనకు ముఖ్యం. శత్రువును ప్రతిఘటించటానికి భారతీయులంతా ఐక్యసంఘటనగా పనిచేయడ మవసరం. శత్రువు చేసే విషప్రచారానికి తగినజవాబు చెప్పవలసియుంది. ఏ విదేశీ పరిపాలకులైనా మనకు శత్రువులే. అను విషయాన్ని మనం ప్రపంచానికి చాటిచెప్పాలి.

"సయాం (జపాను ఆక్రమితదేశం) ముఖ్యపట్టణమైన బ్యాంకాక్‌లో 1942 మధ్యకాలంలో భారత స్వాతంత్ర్య సమావేశం అనుపేరుతో ఒకసభ జరిగింది. దానికి నేను స్వయంగా హాజరయాను. చర్చలలో పూర్తిగా పాల్గొన్నాను. అక్కడ నేను తెలుసుకున్న విషయం ఏమంటే, మనకు జపాను స్వరాజ్యం తెచ్చియిస్తుందనుకోవడమంత తెలివితక్కువ ఆలోచన మరొకటి ఉండబోదు. జపానుకింద అతిక్రూరమైనసామ్రాజ్య పరిపాలన, నీచాతినీచమైన బానిసత్వం తప్ప మరొకటి లభించదు.

"జపాన్‌లో పది సంవత్సరాలుగా నివశించుతూన్న ఒక ప్రముఖ భారత జాతీయ నాయకుడు పై సమావేశానికి హాజరుకాలేదు. ఆయనే రాజా మహేంద్ర ప్రతాప్. అంటే, జపాన్ ఆశయాలేవో ఆయనకు చక్కగా తెలిసివుండాలి.

"కాబట్టి, భారత జాతీయవాదులందరికీ, ముఖ్యంగా కాంగ్రెసువాదులకు, నా విన్నపం ఏమంటే, నేడు ప్రపంచ చరిత్రలో అతిక్లిష్టమైనదశ ఏర్పడింది. ఈ సమయంలో మనం భేదాభిప్రాయాలకు స్వస్తిచెప్పి, విదేశీ దురాక్రమణదారులకు తగినవిధంగా జవాబు చెబుతాం. మన ఋణ్ను, వాకిళ్ళను కాపాడుకొనేటందుకు, శత్రువు దురాలోచనల భగ్నమొనరించేటందుకు, ఏయే మార్గాలవసరమో వాటిననుసరించుదాం."

నేటి పరిస్థితుల్లో మన కర్తవ్యాన్నిగురించి ఇంతకంటె స్పష్టంగా ఎవరు చెప్పగలరు?

కంభంపాటి సత్యనారాయణ

వార్తలు - విశేషాలు

మిస్టర్ జన్ సార్జంటు లండన్‌లో ఉపన్యసిస్తూ, భారతదేశ విద్యావిధానాన్ని తన కమిటీ గావించిన సూచనల ప్రకారం మార్పు చేయడం చాల అవసరమని స్పష్టీకరించాడు.

● కాశ్మీర్ సంస్థానంలో సంపూర్ణమైన బాధ్యతాయుత పరిపాలన స్థాపించబడాలని కోరుతూ కాశ్మీర్ ప్రజాసంస్థ "నేషనల్ కాన్ఫరెన్సు" ప్రభుత్వానికొక మెమొరాండం పంపింది.

● గాంధీజీ విడుదలకు సంతోషించుతూ, అమిరికాకమ్యూనిస్టునాయకుడుఎరల్‌బ్రౌడర్ ఒక తంతి నంపాడు. "హిట్లర్నీ అతని మిత్రులనూ భూమిపై లేకుండా తుడిచివేశాక అన్ని జాతులకు స్వాతంత్ర్యం లభించుతుందని ఆశించుతున్నాను" అని తంతిలో తెలియజేశాడు.

● బొంబాయి అగ్నిప్రమాదంలో నష్టమైన ఆస్తికి ఇండియా ప్రభుత్వం కొంత పరిహార మిచ్చేటందుకు స్కీమునొకదానిని ప్రకటించింది.

● జబల్పూరు జైలులో నిర్బంధింపబడియున్న డిటెన్యూలను గురించి వార్తలు ప్రకటించినందుకు "హితవాద," "నాగపూర్ టైమ్సు" పత్రికా సంపాదకులకు జుల్మానా విధిస్తూ నాగపూర్ ఎడిషనల్ జిల్లామేజిస్ట్రేటు తీర్పుచెప్పాడు.

● మద్రాసు ప్రభుత్వం డిటెన్యూలను యికముందు ఒకే తరగతిలో ఉంచి, భోజన ఖర్చులకు ఒక్కొక్కరికి రు 1-7-0 లు చొప్పున యివ్వటానికి నిశ్చయించింది.

● మలబార్‌లో కరువునివారణ కొరకు జిల్లా అంతటా రేషనింగ్ ప్రవేశపెట్టడం అవసరమని సూచిస్తూ సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ నాయకుడు శ్రీ ఆర్. సూర్యనారాయణరావుగారొక ప్రకటనగావిస్తున్నారు.

● ఆహారసమస్యను గురించి తమిళనాడ్ విద్యార్థి ఫెడరేషన్ వారి విజ్ఞప్తిని ముద్రించినందుకు "జనశక్తి" (రాష్ట్ర పార్టీ పత్రిక) ముద్రాపకునిమీద, ప్రచురణకర్తమీద, ప్రెస్ ఆక్టుననుసరించి కేసు పెట్టబడింది.

● అఖిలభారతట్రేడ్‌యూనియన్‌కాంగ్రెస్ అధ్యక్షులు, కామ్రేడ్ డాంగే, లండన్ చేరుకున్నారు. బ్రిటన్‌లో కార్మికవర్గ పరిస్థితుల్ని గురించి బ్రిటిష్ ప్రజలలో వచ్చినమార్పును గురించి, తెలుసుకొని భారతీయులకు చెప్పడమే తన రాకయొక్క ఉద్దేశమని కామ్రేడ్ డాంగే తెలియజేశాడు.

● బెంగాల్ మంత్రివర్గం ప్రవేశపెట్టిన విద్యావిషయిక బిల్లును వ్యతిరేకిస్తూ ఇద్దరు పార్లమెంటరీ కార్యదర్శులు రాజీనామా లిచ్చారు.

హిందూ - ముస్లిం సమస్య

"జిన్నాను ఒంటరిగా విడిచిపెట్టడమే కాంగ్రెసుయొక్క, గాంధీమహాత్మునియొక్క కర్తవ్యం. ఆతనికంటే యెక్కువ దేశభక్తి గలిగి, నిజాయితీతో ప్రవర్తించే ముస్లింనాయకులు దేశంలో చాలామంది వున్నారు. వారందరినీ సమావేశపరచి, వీలైతే పరిష్కార మార్గం వెతకవచ్చు"

అంటూ, హిందూమహాసభ నాయకుడు, డాక్టర్ మూంజీ ఒక ప్రకటన గావిస్తున్నాడు.

ఇలాగే, పంజాబ్‌రాష్ట్ర హిందూమహాసభ వర్కింగ్‌కమిటీ లాహోరులో సమావేశమై, గాంధీజీ తన దృష్టిని ఇండియా - బ్రిటన్ దేశాలమధ్య జరగవలసిన ఒడంబడికపై కేంద్రీకరించడం మంచిదనీ, మత సమస్యను విడిచిపెట్టవలసిందనీ, కోరుతూ ఒక సూచన గావించింది. హిందువులకు అపకారం కలిగేటట్లు కొందరు ముస్లింలు గాంధీజీచేత పాకిస్తాన్ కోర్కెను అంగీకరింపజేస్తున్నారని విలపించింది.

దీని అర్థం ఏమిటి?

హిందూ - ముస్లిం సమస్యా పరిష్కారానికి గాంధీజీ విడుదల ఎంతో చక్కని అవకాశం కలిగించిందనీ, అట్లుపరిష్కారం త్వరలో జరగాలని దేశంఅంతా ఎదురుచూస్తూంటే, హిందూమహాసభనాయకత్వంతద్వ్యతిరేకంగా ప్రచారంప్రారంభించింది. ఏ కాంగ్రెసు-లీగ్ ఒడంబడికకు సామ్రాజ్యవాదులు యిన్నాళ్లనుంచీ ఆటంకాలు కలుగజేస్తూవచ్చారో, ఆ ఒడంబడిక హిందూమహాసభ నాయకులకు గూడా కంటకంగా తోస్తూంది. కొత్తగా అభివృద్ధిచెందుతూన్న ముస్లింజాతులపై పెత్తనాన్ని చెలాయించడం తప్ప మరొక కారణం వీరి వైఖరిలో కనపడ్డంలేదు. దేశంయొక్క భవిష్యత్తు అంతా కాంగ్రెసు - ముస్లింలీగ్ ఒడంబడికపై ఆధారపడియున్న పరిస్థితులలో హిందూమహాసభ నాయకుల విపరీత వైఖరి సామ్రాజ్యవాదులకు తప్ప మరెవరికీ సాయపడదు.

కాని, వివిధ దృక్పధాల ముస్లిం ప్రజాభిప్రాయం మాత్రం ఐక్యతను గాఢంగా వాంఛిస్తోంది. "గాంధీ - జిన్నా ఒడంబడిక తక్షణమే జరిగితీరాలని దేశం కోరుతోంది" అని పంజాబ్ ముస్లింలీగ్ అధ్యక్షుడు పలికాడు. అందరికీ అనుకూలంగా ఉండేటట్లు హిందూ-ముస్లిం సమస్యను పరిష్కరించాలని ఆయన ఆతృత వెల్లడించాడు. మధ్య పరగణాల "హిందూ - ముస్లిం యూనిటీఅసోసియేషన్" తరపున ఎం. ఎ. లతీఫ్ యజ్దానీ ఒక ప్రకటన గావిస్తూ, వెంటనే జిన్నా గాంధీజీని కలుసుకోవాలని సూచించాడు.

ఢిల్లీ జమియత్ - ఉల్ - ఉలేమా కాన్ఫరెన్సు కాంగ్రెసు నాయకుల విడుదలను కోరుతూ, అల్పసంఖ్యాకులకు స్వయం నిర్ణయహక్కు ఉండాలనీ; అన్ని రాష్ట్రాలు ఏకగ్రీవంగా ఆమోదించిన అధికారాలే కేంద్రప్రభుత్వానికుండాలని తీర్మానించింది. ఈ సూత్రాలపై హిందూ - ముస్లిం సమస్య పరిష్కారం కాగలదని సూచించింది.

ముస్లింలీగ్‌కు పోటీగా స్థాపించబడిన 'ముస్లిం మజిలీస్' సహితం కాంగ్రెసు-లీగ్ ఒడంబడికను కోరుతోంది. "కాంగ్రెసు- లీగ్ ఒడంబడికకు సహాయం చేయాలని మాకున్నంత ఆతృత మరెవరికీలేదు. భారతదేశానికి, అందలి వివిధ భాగాలకు, స్వయంనిర్ణయహక్కు ఉండాలి. ఈ సూత్రంపై ఆధారపడి భారతదేశానికీ - బ్రిటన్‌కూ మధ్య ఒడంబడిక జరగాలి." అని "ముస్లిం మజిలీస్" నాయకుడు ఎస్. ఎ. మజీద్ తెలియజేస్తున్నాడు.

డాక్టర్ అష్రాఫ్ (కమ్యూనిస్టు) చెప్పినట్లు "గత కేంద్ర శాసనసభలో సాధింపబడ్డ ఐక్యత దేశీయులవాంఛను స్పష్టంగా తెలియజేస్తోంది. ఈవాంఛకు గాంధీజీ తగినంత బలంయిచ్చి, పోషించుతాడని నాకు గట్టి ధీమాఉంది. అట్టి ఐక్యతకు త్వరలోనే మార్గం అన్వేషించబడుతుంది. తద్వారా మనం బ్రిటిష్ ప్రభుత్వంయొక్క చేతుల్లోనుండి అధికారాన్ని గుంజుకొని నేడు మన ప్రజల నెదుర్కొంటూన్న అనేక విషమసమస్యలను పరిష్కరించుకొనగల్గుతాం.

"అయితే, కొన్ని యదార్థపరిస్థితుల్ని గుర్తిస్తేగాని, ఐక్యత సుస్థిరంగా నిలబడదు. ఉదాహరణకు, దేశంలో అన్ని దృక్పధాలకు చెందిన ముస్లింలు నేడు స్వయంనిర్ణయహక్కును కోరుతున్నారు. ఈమధ్య ఢిల్లీలో జరిగిన జాతీయ ముస్లిం సమావేశంలో ఈ విషయం స్పష్టంగా తేటతెల్లమయింది. కాబట్టి నేటి పరిస్థితుల్లో యీహక్కును గుర్తించడం తప్ప మరొక పరిష్కారమార్గంలేదు. రెండో విషయం ఏమంటే, నేడు ముస్లింలీగ్ అత్యధికమైన భారత ముస్లింల విశ్వాసాన్ని చూరగొన్నసంస్థ. కాబట్టి, జాతీయైక్యతకు అర్థం ప్రధానంగా కాంగ్రెసు - ముస్లింలీగ్‌ల ఐక్యత. ఈ యదార్థపరిస్థితులను గుర్తించకుండా జాతీయైక్యతను సాధించ పూనుకోవడం వృధా ప్రయాసతప్ప మరొకటికాదు. అట్టి విధానంవల్ల రాజకీయ ప్రతిష్ఠంభన పరిష్కరింపబడకపోగా, ఇప్పటి అనుమానాలు - అపనమ్మకాలు ఇంకా యెక్కువవుతాయి. అంతే దేశస్వాతంత్ర్యానికి అడ్డుతగిలేవారికి సహాయం చేసినవారమవుతాం."

ఊరేగింపులో 4 వేలు, మహాసభలో 10 వేలు, ప్రజలు పాల్గొన్నారు

(1 వ పేజీ తరువాయి) వారు ఉన్నారు. శ్రీ వట్టికోట ఆళ్వారుస్వామిగారు "దేశోద్ధారక గ్రంథమాల" సంపాదకులు. "స్వదేశసంస్థానాలు" మొదలైన రాజకీయగ్రంథాలు వీరిచే ప్రచురించబడ్డాయి. 1942 ఆగస్టు సత్యాగ్రహంలో 11 నెలలు జెయిలులోవుంది. విడుదలయినప్పటినుంచి ఆంధ్రమహాసభలో పనిచేస్తున్నారు.

శ్రీ పోల్కంపల్లి వెంకటరామారావుగారు వకీలు. ధాన్యగ్రహణశాసనంలో రైతులకీయబడిన మినహాయింపులను అమలు జరిపించుటకై పదిగ్రామాలు సంచారంచేసి. ప్రధానమంత్రికి మెమొరాండం పంపించారు.

శ్రీ కాళోజీ నారాయణరావుగారు వరంగల్లులో వకీలు. 1942 లో సత్యాగ్రహంచేసి జెయిలుకువెళ్లారు. "ఆంధ్ర సారస్వత సమితి"కి వీరు కార్యదర్శి.

24 వ తేదీని స్థాయిసంఘసభ (తరువాత యిదే విషయనిర్ణయసభగా మారింది) ప్రారంభమయింది. క్రిందటిసంవత్సరం ఆంధ్రమహాసభ కధ్యక్షత వహించిన శ్రీ కొండా వెంకటరెడ్డిగారు లేచి, సమావేశాన్ని ప్రారంభించుతూ. కమ్యూనిస్టులపై లేనిపోనినిందలు మోపారు. ఆంధ్రమహాసభను కమ్యూనిస్టులు తమవశం చేసుకొంటున్నారట; వారి పనులవల్ల ప్రజలకు నష్టం కలిగినదేగాని. లాభం కలుగలేదట. ఆధారరహితమైన యిట్టి ఆరోపణను ఖండిస్తూ. క్రొత్తఅధ్యక్షుడు రావి నారాయణరెడ్డిగారు. ఆంధ్రమహాసభ ప్రజాస్వామిక సంస్థఅనీ, అందులో అన్ని రాజకీయ పక్షాలకు స్థానముందనీ, పై ఆరోపణ నిరాధార మైనదనీ వివరించారు.

"జాతీయపక్షం" వారిపోకడ

ఈ ఆరోపణవెనుక చాలా గాథవుంది. గతసంవత్సరం అధికారంలోవున్న కార్యకర్తలు ప్రజలను నిత్యం ఎదుర్కొనే భీషణసమస్యలకు పరిష్కారమార్గం చూపడంగాని, ఆంధ్రమహాసభ కార్యక్రమాన్ని ప్రజలలో ప్రచారం చేయడంగాని, చేయలేదు. పైగా కొన్నిచోట్ల అలాచేసే కమ్యూనిస్టులకు ఆంధ్రమహాసభ కమిటీలలో స్థానంలేకుండా చేశారు. నానాటికి విశాలమైన ప్రజాసంస్థగా అభివృద్ధి చెందుతూన్న ఆంధ్రమహాసభను సంకుచితపరచడానికి వీరు ఎన్నికలకు వాయిదావేశారు. ఈయేడు మహాసభ జరుగనవసరం లేదని వర్కింగ్ కమిటీలో తీర్మానించబడింది.

ఈ వైఖరిని క్రిందికమిటీలు వ్యతిరేకించాయి. కొత్త ఎన్నికలు జరిపి. ఆంధ్రమహాసభ కార్యక్రమాన్ని ప్రచారం చేయుట కింకా ఎక్కువ అవకాశము లీయవలసిందని కోరుతూ క్రిందికమిటీలు, కొందరు ముఖ్యమైన కార్యకర్తలు, విజ్ఞప్తిచేశారు. కాని, కొత్తఎన్నికలు జరిపితే తమ విధానం అంగీకరింపబడదనే భయంతో, వీరు స్థాయిసంఘ సమావేశంలో ఎటూ వోటుచేయక, తటస్థంగావున్నారు. ఈతటస్థవిధానంవల్ల తమ వైఖరిని సమర్థించుకొన జూచారు. "జాతీయపక్షం" అనేపేరుతో కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా ఆధార రహితమైన ఆరోపణలు చేస్తున్నారు.

తాము స్వయంగా పోషించి పెంచిన సంస్థ నానాటికి బలం చేకూర్చుకోవడంచూచి గర్వించడానికి బదులు, కార్యనిర్వహణలో ఎట్టి సహాయంచేయకుండా, కాన్ఫరెన్సును బహిష్కరించడం విచారించవలసిన విషయం. ఇంతవరకూ కమ్యూనిస్టులు ప్రజల నెదుర్కొంటూన్న అనేక సమస్యలపై "జాతీయపక్షం" వారితో కలిసి పనిచేస్తూ వచ్చారు. వివిధరాజకీయ దృక్పథాలు కలిగిన వారంతా కలిసిపనిచేయదాని కనుగుణ్యమైన కార్యక్రమం తీసుకొని, ఆంధ్ర మహాసభలో దాన్ని అంగీకరింపజేస్తూ. సంస్థయొక్క ఐక్యతను కాపాడుకొంటూ వస్తున్నారు. అన్ని రాజకీయపార్టీలకు, దృక్పథాలకు, ఆంధ్రమహాసభలో స్థానం ఉన్నదని, తమతో సహకారం చేయవలసిందని విజ్ఞప్తిచేస్తూ తమ కరపత్రాలలో స్పష్టీకరించారు.

ఊరేగింపు

27 వ తేదీ సాయంత్రం 11 ఎడ్ల జతలు కట్టినబండిలో మహాసభాధ్యక్షుని ఊరేగింపు జరిగింది. వివిధ జిల్లాల నుండి వచ్చిన ప్రతినిధులు, ప్రేక్షకులు, మొత్తం నాలుగైదువేలమంది ఊరేగింపులో పాల్గొన్నారు.

"ఆంధ్రమహాసభంట
ఆంధ్రుల మీటింగులంట
నల్లగొండ జిల్లాలో
మనతెల్గు ప్రాంతములోన"
— అనీ,
"కరువువచ్చి బెంగాల్
ప్రజ కాలుచున్నారు"

మొదలైన పాటలతోను, "హిందూ—ముస్లిం ఏక్ హో," "ఆంధ్రమహాసభకుజై", "కాంగ్రెసు నాయకుల్ని విడుదల చేయాలి," "జాతీయప్రభుత్వం కావాలి", "వెట్టిచాకిరి నశించాలి", మొదలైన నినాదాలతోను. భువనగిరి వీధులగుండా ఊరేగింపు నడిచింది.

ఒకరైతు. తాను మల్కాపురం మహాసభకు వెళ్ళాను గాని. అప్పుడు వ్యవసాయపనులకు యిప్పటివలె యెద్దడి లేదనీ, ఐనప్పటికీ ఈ మహాసభకు అప్పటికంటె ఎక్కువ ప్రజలు వచ్చారనీ. చెప్పాడు. భువనగిరికి 12 మైళ్ళ దూరంలో యాదగిరి నరసింహస్వామి తిరణాలు జరుగుతుంది. దానికికూడా ఇంతమంది ఎప్పుడూ రాలేదని నలుగురు రైతులు చెప్పుకుంటూంటే విన్నాను. ముగ్గురు పోలీసుకాన్‌స్టబుల్సు ఊరేగింపుచూచి, "బడీజమియత్ హై" (పెద్దసైన్యం) అని ఆశ్చర్యపోతున్నారు. ఊరేగింపుకు ముందు బ్యాండ్ సెట్ కదంతొక్కుతూ. మిలిటరీవాయిద్యాలు పాడుతూంటే. పోలీసు కాన్‌స్టేబుల్స్‌లో అలా ఆశ్చర్యం కలగడం వింతకాదు.

ఊరేగింపులో హిందువులు - ముస్లింలు కలిసి పాటలు పాడుకుంటూ, నినాదాలిస్తూ సాగిపోతూంటే. ఒకముస్లిం మరొకముస్లిం స్నేహితునితో యిట్లా అన్నాడు: "ఖుదా ఇసీతరీఖేసే ఇత్తిహాద్ కరాయే" (దైవం యిట్టి ఐక్యతను యికముందుకూడా యిచ్చుగాక). ఒక ముసలి మహమ్మదీయుడు ఊరేగింపులో పాల్గొన్న 4 వేలమంది హిందూ - ముస్లిం ప్రజల్ని, 100 మంది స్త్రీలను, పనిపాపలనుచూచి, చకితుడయాడు. వృద్ధులు, స్త్రీలు, బాలబాలికలు — యింత ఉత్సాహంతో పాల్గొంటూన్న ఊరేగింపుకు పట్టణమందలి ముస్లిం ప్రజలంతాకూడా సహకారం చేయలేదే! అని బాధపడ్డాడు. అన్నివీధులలోను స్త్రీ పురుషులు, బాలబాలికలు పరుగులెత్తుకుంటూవచ్చి, నిర్ఘాంతపోతూ చూచారు. ఊరేగింపులో పాల్గొంటూన్న ఒక రైతు తన ప్రక్కవానితో యిలా అంటున్నాడు: "ఏ చక్రవర్తి ఇంత వైభవంగా ఊరేగినాడు? నారాయణరెడ్డి నిజంగా పుణ్యమూర్తి." అజంజాహీమిల్లులో పనిచేసుకొనే ఒక ముస్లిం కార్మికుడు తన కుటుంబంతోసహా వచ్చి ఊరేగింపులో పాల్గొన్నాడు. సికింద్రాబాద్‌నుంచి 30 మంది రైల్వేవర్కుషాప్ కార్మికులు వచ్చారు. హైదరాబాద్‌నుంచి కాలేజీ విద్యార్థులు, కొద్దిపాటి వ్యాపారం చేసుకునే వర్తకులు, ఊరేగింపులో పాల్గొన్నారు. నల్లగొండజిల్లా వాలంటీరుకెప్టెన్ బి.నరసింహారెడ్డిఅమ్మమ్మ. తన మనుమడు ఆంధ్రమహాసభకుచేసే కృషిని స్వయంగా చూచి, ఆనందించుతూ ఊరేగింపులో చేరింది. రాత్రిభోజనాలయాక ప్రతినిధుల బసకు వచ్చాను. ఊరేగింపునుగురించి శ్రీ పోల్కంపల్లి వెంకట్రామారావుగారు యిలాచెప్పారు: "నేను యింతవరకు ప్రతి ఆంధ్రమహాసభ కాన్ఫరెన్సుకు వెళ్ళాను. ఇది వాటన్నింటిని మించింది. ఇంతపెద్దఊరేగింపు ఎప్పుడూ జరగలేదు. నాకు శరీరంలో అస్వస్థతగా ఉన్నప్పటికీ, ఈ నాలుగురోజులు ఉండడానికి కారణం ఇట్టి అద్భుతమైన దృశ్యాలను చూడ్డానికే! నా కోరిక యిప్పుడు ఫలించింది. వచ్చేసంవత్సరం ఇంతకంటే యెక్కువ వైభవంగా కాన్ఫరెన్సు జరగాలి. 25000 మందిని అయినా అప్పటికి సమీకరించాలి."

"జాతీయపక్షం" వారు కూడా మహాసభకు సహకారం చేసి యుంటే. ఇంతకంటె ఎక్కువ ప్రజలు వచ్చియుండేవారని శ్రీ దత్తాత్రియ శర్మగారు పలికారు.

ఇద్దరు స్థాయిసంఘ సభ్యులు పూర్వం జరిగిన కాన్ఫరెన్సుల కంటె యిది పెద్దదని అంగీకరించారు. ఊరేగింపులో కనీసం 4000 మంది ఉంటారని వీరిఅంచనా. "ఆలీషాం" (అత్యద్భుతం) అని ఊరేగింపును గురించి కాళోజీ నారాయణరావుగారు పలికారు.

మహాసభ

27 వ తేదీ రాత్రి 8 గంటలకు మహాసభ ప్రారంభమయింది. దాదాపు పదివేలమంది ప్రజలు యిందులో పాల్గొన్నారు. హైదరాబాద్‌లో "మీజాన్" (త్రాసు) పత్రిక సంపాదకులును, కవి - చిత్రకారుడును అయిన శ్రీ అడివి బాపిరాజుగారు; నిజాంరాష్ట్ర ఆంధ్ర మహిళాసభకు అధ్యక్షురాలైన శ్రీమతి ఎల్లాప్రగడ సీతాకుమారిగారు; హైదరాబాద్ మహిళా ఉద్యమ నిర్వాహకురాండ్రైన శ్రీమతి రంగమ్మ ఓబులురెడ్డి. సంగం లక్ష్మీబాయమ్మగారలు మహాసభకు ప్రేక్షకులుగా వచ్చారు. హైదరాబాద్ ఆహారకమిటీ అధ్యక్షుడు, మాజీ సిటీపోలీస్ కొత్వాల్ అయిన శ్రీ రాజాబహదూర్ వెంకటరామారెడ్డిగారు కూడా హాజరయారు. ఆహార సమస్య విషయంలో ఆంధ్రమహాసభకు ఎక్కువగా తోడ్పడుతూన్న మల్లిక్ అబ్దుల్ అల్లీఖాన్ (ల్యాండ్ రికార్డు ఆఫీసరు): నిజాంరాష్ట్రి ముస్లింల ప్రజాసంస్థ "మజ్లీస్-ఎ-అంజామాన్ ఇత్తిహాదుల్ ముసల్మీన్" యొక్కస్టాండింగు కమిటీ సభ్యులైన అక్బర్ వుఫాఖానీ మొదలైన ముస్లింప్రముఖులు మహాసభలో అధ్యక్షవేదికకు సమీపంలో కూచున్నారు.

రావి నారాయణరెడ్డిగారు తమ అధ్యక్షోపన్యాసంలో, నిజాం ఆంధ్రజిల్లాల రైతాంగం అనుభవించే బాధలను వర్ణించి, వాటిపరిష్కారార్థం చక్కని సూచన లిచ్చారు. ఉపన్యాసం చాలా దీర్ఘంగా ఉన్నప్పటికీ, ప్రజల నిత్యజీవితానికి సంబంధించిన సమస్యలను చర్చించుతూంటే, ప్రేక్షకులు శ్రద్ధతో విన్నారు. ఉపన్యాసం పూర్తిఅయేవరకు ఓపికతో కూచున్నారు. హైదరాబాద్ సంస్థానంలో ప్రజామంత్రివర్గ స్థాపనఅవసరమనీ; అందులో సగంప్రాతినిధ్యం ఇత్తిహాదుల్ ముసల్మీనుకు, మిగతాసగం ఆంధ్రమహాసభ, మహారాష్ట్రి, కర్ణాటక పరిషత్తులకు వుండాలని-సూచించారు.

మహారాష్ట్రి పరిషత్తుకు ఆహ్వాన సంఘాధ్యక్షులైన శ్రీ హీరాలాల్‌కొటేచా ఉపన్యాసవేదిక నెక్కి యిలా పలికారు: "జాతీయోద్యమంలో అనేక త్యాగాలు చేసినవారు ఆంధ్రమహాసభను యింత ఉచ్ఛస్థితికి తీసుకురావడం ప్రశంసించవలసిన విషయం. "జాతీయపక్షం" వారు యీ మహాసభను బహిష్కరించడం సరికాదు. వారి సహకారంకొరకు కొత్తకార్యనిర్వాకులు తిరిగి ప్రయత్నించవలసియుంది. ఇత్తిహాదుల్ ముసల్మీను నాయకులలో ఒకరైన అక్బర్ వుఫాఖానీ యిలా ఉపన్యసించారు: "నేడు మన దేశాన్ని ప్రధానంగా ఎదుర్కొంటూన్న సమస్య ఆహారసమస్య. ప్రజలు, ప్రభుత్వం కలిసిదాన్ని పరిష్కరించక పోతే, బెంగాల్‌గతి మనకుకూడాపట్టవచ్చు హిందువులు-ముస్లింలు కలిసిపనిచేస్తే, తప్పకుండా పరిష్కారం సాధ్యమవుతుంది. దీనికి ప్రధానకారకులైన నిల్వవ్యాపారస్థులకు వ్యతిరేకంగా మనం ప్రజలందరినీ సమీకరించాలి." (మిగతా 8 వ పేజీ)

Printed and Published by Katragadda Rajagopala Rao at Prajasakti Press, Governorpet - Bezwada.

END OF ISSUE